తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వేల: 3 | సంపుటి:3 | సంచిక: 226

గురువారం 22, జనవరి 2026

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## మున్సిపల్ ఎన్నికలకు జాగృతి దూరం

- ఎవరు కోరినా మద్దతు ఇస్తాం
- ఫోన్ ట్యాపింగ్ తుదిదశకు చేరుతుందన్న నమ్మకం లేదు
- మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్,జనవరి21(అక్షర గళం):** జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని.. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలపై కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కవిత మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎవరు మద్దతు కోరినా ఇస్తామని కవిత తెలిపారు. అవసరమైన చోట తనతో పాటు జాగృతి నేతలు ప్రచారం చేస్తారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తుదిదశకు చేరుతుందనే నమ్మకం తనకు లేదన్నారు. తనలాంటి బాధితులకు న్యాయం మిగతా.. 2లో



## హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు

- రేవంత్ ప్రతిపాదనకు మద్దతు
- 'జాయిన్ ది రైజ్'లో తెలంగాణ విజన్ ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా చిరంజీవి

2లో

# హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలి 'స్విస్ మాల్'

**దావోస్:** ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) 2026 సందర్భంగా దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, స్విట్జర్లాండ్‌లోని వాడ్ రాష్ట్ర ముఖ్య మంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్‌తో కీలక సమా వేశం నిర్వహించారు. ఈ భేటీలో భారత్–స్విట్జర్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య సహకార పెంపుపై చర్చించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్–2047 విజన్‌ను స్విస్ ప్రతినిధు లకు వివరించారు. హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలిసారి 'స్విస్ మాల్' ఏర్పాటు చేయాలనే ఆలో చనను ముఖ్యమంత్రి ప్రతిపాదించగా, స్విస్ బృందం వెంటనే సానుకూలంగా స్పందించింది. ఇద్దరు ముఖ్య మంత్రులు ఫుట్‌బాల్ ఆటగాళ్లే కావ డంతో, క్రీడల రంగంలో భాగస్వా మ్యంపై కూడా విస్తృతంగా చర్చిం చారు. క్రీడా శిక్షణ, మౌలిక వసతుల అభి వృద్ధిలో కలిసి పనిచేయవచ్చని అభిప్రాయపడ్డారు.

సంస్కృతి, విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణరంగాల్లో.. ముఖ్యంగా హాస్పిటా లిటీ మేనేజ్‌మెంట్, క్రీడల విభాగాల్లో.. పరస్పర సహకారానికి అవకా శాలపై లీడర్లు అభిప్రాయాలు పంచుకున్నారు. రిటైల్ , లైఫ్ సైన్సెస్‌లో రంగాల్లో అవకాశాలపై చర్చించారు. మహిళా సాధికారతకు సంబంధించి స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలపై స్విస్ బృందం ఆసక్తి కనబరిచింది. సహకార అంశాలు పరిశీలిం చేందుకు త్వరలోనే స్విట్జర్లాండ్ బృందం హైదరా బాద్‌కు వస్తుందని వాడ్ రాష్ట్ర పరిశ్రమలు, ఆర్థిక శాఖ మంత్రి ఇసబెల్ మోరెట్ తెలిపారు.



## ఏఐతో మెరుగైన పౌర సేవలు

- ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

2లో

## హైదరాబాద్‌లో 'బ్యూటీ-టెక్'

ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ జీసీసీ ...

ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభం



## సింగరేణిని బంగారు బాతుగా వాడుకున్నారు

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు

5లో

# మేడారంలో జాతర సందడి

- భారీగా తరలి వస్తున్న భక్త జనం
- ఘనంగా మండమెలిగె పండగ నిర్వహణ
- గద్దెల వద్ద పూజులరు ప్రత్యేక పూజలు


**ములుగు,జనవరి21(అక్షర గళం):** మేడారం సమ్మక్క సారలమ్మ దేవతల మండ మెలిగే పండుగను పూజారులు – అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉద యాన్నే మేడారం సమ్మక్క దేవత పూజరులు సిద్దబోయిన, కొక్కెర, మ్లలెల, వంశీయులు, నె రాలమ్మ పూజారులు కాక వంశీయులు వారి వారి ఇళ్లను శుభ్రం చేసుకున్నారు. అనంతరం పిల్లాపాపలతో సహా పవిత్ర స్నానాలు చేశారు. సమ్మక్క పూజారులు మేడారం గుడికి సారల మ్మపూజారులు కన్నెపెల్లి గుడికి వెళ్లి గుడులను పవిత్ర గోదావరి జలంతో శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క పూజారి ఆయన సిద్ధబో యిన నితిన్, సారలమ్మ పూజారి అయిన కాక సారయ్య ఇండ్ల వద్ద డోలు వాయిద్యాల నడుమ మామిడాకు తోరణాలను కట్టారు. అక్కడినుం డి పూజారులు ఆడపడుచులు (ఆడబిడ్డలు) పూజా సామగ్రితో మంగళ హారతులతో ఆయా గుడులకు చేరుకున్నారు. ఆడబిడ్డలు అడవి నుంచి తెచ్చిన పుట్ట మన్నుతో గుడులను అలికి ముగ్గులు వేశారు. అనంతరం పూజారులు డోలు వాయిద్యాల నడుమ బొడ్రాయి, ముత్యా లమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి లకు నూతన వస్త్రా లు పెట్టి పసుపు కుంకుమ పెట్టి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అక్కడ నుంచి నేరుగా ఆలయం ముందు బురికా స్తంభాలతో తోరణా నికి చీడపీడలు రాకుండా కోడిపిల్ల, సొరకాయ, మిరపకాయ, మామిడి, వేప మండలు కట్టి తోరణం కట్టారు. అనంతరం గ్రామ పొలిమే రలల్లో బూరిక చెట్లతో తోరణాలు కట్టారు. సాయంత్రం డోలు వాయిద్యాల నడుమ గద్దెల వద్దకు చేరుకొని రహస్య పూజలు చేశారు. దీంతో మహాజాతరకు అంతా సిద్ధమని పూజారులు తెలిపారు. ఇదిలావుంటే గత వారం రోజులుగా భక్తుల పెద్ద ఎత్తున పోటెత్తారు. భారీగా తరలి వస్తున్నారు. దీంతో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



## మున్సిపల్ ఎన్నికల వేళ 47 మంది కమిషనర్ల బదిలీ

- తక్షణం విధుల్లో చేరాలని ఆదేశం

**హైదరాబాద్,జనవరి21(అక్షర గళం):** మున్సిపల్ ఎన్నికలకు ముందు పలువురు కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. ఏకంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే విధుల్లో చేరాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే క్రమశిక్షణా చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు సొంత జిల్లాల్లో ఉన్నవారిని, అలాగే ఒకే చోట మూడేళ్లు దాటిన వారిని మార్చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.




బదిలీ అయిన వివరాలు ఇలా ఉన్నాయి. సి.వి.ఎన్. రాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎఎ), ఆదిలాబాద్ మున్సిపాలిటీ, ఉమా మహేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎ), ప్రస్తుతం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పని చేస్తున్నారు., కె. సమ్మయ్య, సెక్షన్ ఆఫీసర్, సచివాలయం హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. కీర్తి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎఎ), చొప్పదండి మున్సిపాలిటీకి, టి. మనోహర్, మేనేజర్, రాయికల్ మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు.

ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎదులాపురం మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు.

ఎం. రామదుర్గ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎ), హాలియా మున్సిపాలిటీ.

నజీబ్, మేనేజర్, భూత్పూర్ మున్సిపాలిటీలో మిగతా.. 2లో



## నాపై తప్పుడు ప్రచారం తగదు

- క్షమాపణ చెప్పకపోతే నిరాహార దీక్ష
- నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి


5లో

## నాకేదైనా జరిగితే.. ఇరాన్ ఔట్

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**

**వాషింగ్టన్,జనవరి21(అక్షర గళం):** ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఇరాన్ హత్యకు పాల్పడితే.. ఆ దేశాన్ని అమెరికా భూస్థాపితం చేస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనపై ఏదైనా హత్యాయత్నం జరిగి, దాని వెనక ఇరాన్ హస్తం ఉందని తేలితే.. ఆ దేశాన్ని తుడిచిపెట్టేయాలని తన సలహాదారులను ఆదేశించినట్లు ట్రంప్ ఇప్పటికే ఓసారి వ్యాఖ్యలు చేశారు. తాజాగా మరోసారి అదేతరహా హెచ్చరికలు చేశారు. కాగా.. డిసెంబర్ నుంచి పాలకులకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజలు నిరసనలు చేపడుతున్నారు. దీంతో తమ దేశంలో నెలకొన్న ఆందోళనలకు మిగతా.. 2లో



## కాంగ్రెస్‌కే ఆ శక్తి ఉంది


- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

6లో

# కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తేయడం ఖాయం..!

- మున్సిపల్ ఎన్నికలకు మేం సిద్ధం
- స్థానిక సమస్యల ఆధారంగానే ప్రజల తీర్పు
- మీడియాతో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,జనవరి21(అక్షర గళం):** మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తివేయటం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. స్థానిక సమస్యల ఆధారంగానే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేస్తారని.. ఫార్ములా ఈ, ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆధారాలు చూపలేకపోయారని అన్నారు. ఫార్ములా ఈ కేసులో దోషులుగా చెప్తోన్న గ్రీన్ కోతో దావోస్‌లో రేవంత్ చర్చలు జరుపుతున్నారని అన్నారు . మున్సిపల్ ఎన్నికల్లో కేసీఆర్, నేను ప్రచారం చేసేదేమీ ఉండదని.. సర్పంచ్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేసినా కాంగ్రెస్ సాధించింది ఏమీ లేదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సర్పంచులను గెలిచామని.. మున్సిపల్ ఎన్నికల్లో కూడా మెజారిటీ సీట్లు గెలుస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు జరుగుతాయి. జిల్లా పరిషత్ ఎన్నికలు పెట్టే అలోచనలో ప్రభుత్వం లేదు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత అసెంబ్లీ ఎన్నికలేనన్నారు. మున్సిపల్ ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నామని.. శివరాత్రి లోపలే మున్సిపల్ ఎన్నికలు ముగిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. బస్తీబాట కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుంటున్నాం. పదేళ్లలో మేము చేసినవి.. కాంగ్రెస్ రెండేళ్లుగా చేయనివి గుర్తు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సర్వేలు, అభ్యర్థి బలాలు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఎన్నికల్లో జనసేన సహా ఎవరైనా పోటీ చేయొచ్చు. క్షేత్రస్థాయిలో బలముంటే తప్ప.. స్థానిక ఎన్నికల్లో గెలవటం ఈజీ కాదు. జిల్లాలను ఎత్తేసే ప్రయత్నం జరుగుతుంది. జనగాం, నారాయణ పేట, వనపర్తి, సిద్దిపేట, సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాలను ఎత్తేస్తారనే ఆందోళన ఉంది .జిల్లాలు ఉండాలా.. పోవాలా..? అనేది మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారు. బొగ్గు కుంభకోణంపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా..? రేవంత్ రెడ్డి మిగతా.. 2లో



## రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడగలరా..?

- నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాద్,జనవరి21(అక్షర గళం):** శ్రీరాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడే దమ్ము బీజేపీకి ఉందా అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని.. కాంగ్రెస్ తోనే నిజామాబాద్ అభివృద్ధి సాధ్యమని అన్నారు బుధవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ బీజేపీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకుల తప్పిదాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని.. వాటిపై మిగతా.. 2లో



# సభకు రాకుండా జీతాలు తీసుకుంటే ఎలా..?

- ఇది ముమ్మాటికీ అనైతిక చర్యే అవుతుంది
- ఇలాంటివి నిరోధించేలా చట్టం తీసుకుని రావాలి
- శాసనసభాపతుల సదస్సులో స్పీకర్ అయ్యన్న వ్యాఖ్య

**లక్నో,జనవరి21(అక్షర గళం):** శాసనసభకు ఒక్క రోజు కూడా హాజరు కాకుండా కొందరు ఎమ్మెల్యేలు జీతభత్యాలు తీసుకుంటున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. నో వర్క్.. నో పే' అనే విధానం చట్టసభల్లోనూ రావాలని ఆయన అన్నారు. దానికి అనుగుణంగా చట్టం చేయాలని.. దానికి సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఆయా విభాగాల్లో ఉద్యో గులు విధులకు హాజరు కాకపోతే.. సంబంధిత అధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం సహా వారి వేతనాలు నిలిపి వేస్తున్నారన్నారు. మరి తాము ఎన్నుకున్న ఎమ్మెల్యేలు సభకు రానప్పుడు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అయ్యన్న తెలిపారు. ఇలాంటి అనైతిక ప్రవర్తనను ఎలా సమర్థించగలుగుతామని ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో నిర్వహించిన మిగతా.. 2లో



# హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు



### రేవంత్ ప్రతిపాదనకు మద్దతు
### 'జాయిన్ ది రైజ్'లో తెలంగాణ విజన్ ప్రదర్శన
### ప్రత్యేక ఆకర్షణగా చిరంజీవి

**దావోస్/(అక్షరగళం):** ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా



ఎక్కువ సమయమని సీఎం వ్యాఖ్యానించారు. అందుకే ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో ఫాలోఅప్ ఫోరం నిర్వహిం చాలని వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధులకు సూచిం చారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించగలిగిందని తెలిపారు. ప్రతి ఏడాది ఎంవోయూలపై సంతకాలు చేసేందుకు దావోస్‌కు వస్తామని, ఈసారి మాత్రం తెలం గాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను ప్రపంచానికి చూపించేందుకే వచ్చామని సీఎం చెప్పారు. హైదరాబాద్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు ప్రధాన కేంద్రంగా మారిందన్నారు.

**నైట్ టైమ్ ఎకానమీపై ప్రత్యేక దృష్టి**

మూసీ నది పునరుజ్జీవనం, రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు నైట్ టైమ్ ఎకానమీపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో 50 శాతం కంటే ఎక్కువ గ్రీన్ కవర్ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. అదే వేదికపై తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, తెలంగాణ నెక్స్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–2030ను ఆవిష్కరించారు. సమావేశంలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్‌లో మెట్రో రైలు విస్తరణ, చెరువులు–కుంటల పునరుజ్జీవనం వంటి గేమ్‌చేంజర్ ప్రాజెక్టులను వివరించారు. అలాగే కొత్తగా ప్రతిపాదించిన కోర్, ప్యూర్, రేర్ ఆర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావించారు. తెలంగాణలో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, సాంకేతికత, అనుభవం, నైపుణ్యాల పరంగా గ్లోబల్ కంపెనీల సహకారాన్ని స్వీకరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యమంత్రితో కలిసి విందులో పాల్గొన్నారు.



## ఏఐతో మెరుగైన పౌర సేవలు

**ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**దావోస్/హైదరాబాద్, (అక్షరగళం):** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వినియోగించి రాష్ట్రంలో పౌర సేవలను మరింత సమర్థవంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక ఆధ్వర్యంలో దావోస్‌లో నిర్వహించిన 'ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ బిల్డింగ్ కంపెటిటివ్ నెస్' అంశంపై ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రేవంత్ రెడ్డి తెలిపారు, రైతు భరోసా వంటి సబ్సిడీల ట్రాకింగ్, ఆస్తి పన్ను వసూళ్లు, మహిళలకు అందించే సంక్షేమ పథకాల అమలు, పట్టణ మున్సిపల్ సమస్యల పరిష్కారం వంటి అనేక రంగాల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. "వ్యవస్థలోని మేధస్సే ఒకవైపు సమస్య, మరోవైపు పరిష్కారం అవుతోంది. దీన్ని సరైన దిశలో వినియోగిస్తే పాలన మరింత సమర్థవంతంగా మారుతుంది" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అదునాతన ఏఐ యుగంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపలేవని, ముందస్తు చర్యలు తీసుకోవడం, వేగంగా నిర్ణయాలు అమలు చేయడం కీలకమని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను వివరిస్తూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రంగా మారిందని, అన్ని రంగాల అగ్రశ్రేణి కంపెనీలు తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా ఉండాలంటే మేధోవంతమైన వ్యవస్థలను నిర్మించాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సదస్సులో స్మార్ట్ ఫ్యాక్టరీలు, స్థిరమైన ఇంధన వ్యవస్థలు, ఏఐ ఆధారిత సేవలు, స్మార్ట్ సిటీల నిర్మాణంపై ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ విధానాలపై చర్చలు జరిగాయి. సదస్సులో ఈజిప్ట్ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య మంత్రి హస్సన్ ఎల్ఖతీబ్, ఎమరాల్డ్ ఏఐ సీఈఓ వరుణ్ శివరామ్, ప్రపంచ మేధోసంపత్తి సంస్థ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జర్మనీ డిజిటల్ మంత్రిత్వ శాఖ మంత్రి కార్ స్టెన్ వైల్డ్‌బెర్గర్, నోకియా సీఈఓ జస్టిన్ హోటార్డ్, హిటాచి సీఈఓ తోషియాకి టోకునాగా తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## తెలంగాణ-బ్లైజ్ కంపెనీ ఒప్పందం

**దావోస్, (అక్షరగళం):** దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో తెలంగాణ ప్రభుత్వం కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డితో బ్లైజ్ కోఫౌండర్ సీఈఓ దినాకర్ మునగాలా సమావేశమై ఈ ఒప్పందాన్ని ఖరారు చేశారు. డేటా సెంటర్లు, ఏఐ హార్డ్‌వేర్, ఫుల్‌స్టాక్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో పనిచేస్తున్న బ్లైజ్ సంస్థ హైదరాబాద్‌లో ఉన్న తన రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ సెంటర్‌ను విస్తరించనుంది. ఈ విస్తరణతో స్థానిక యువతకు అధిక నైపుణ్య ఉద్యోగావకాశాలు కలగనున్నాయి.



హెల్త్‌కేర్ డయాగ్నోస్టిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్, ఎనర్జీ ఎఫిషియెన్సీ రంగాల్లో ఏఐ పైలట్ ప్రాజెక్టులను అమలు చేసే అవకాశాలపై చర్చలు జరిగాయి. దీని ద్వారా పరిశ్రమల ఉత్పాదకత పెరగడంతో పాటు శక్తి వినియోగం తగ్గే అవకాశం ఉంది. తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. బ్లైజ్ ఆర్ అండ్ డీ విస్తరణకు పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్రంలో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇది ఏఐ పెట్టుబడులు, పరిశోధనలు, ఆవిష్కరణలకు కీలక కేంద్రంగా నిలవనుంది.

## హైదరాబాద్‌లో 'బ్యూటీ-టెక్'

**ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ జీసీసీ ...**

**ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభం**

**దావోస్/హైదరాబాద్, (అక్షరగళం):** ప్రపంచంలోనే తొలి బ్యూటీ–టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ సౌందర్య ఉత్పత్తుల సంస్థ లోరియల్ ప్రకటించింది. అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో కూడిన ఈ కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనున్నట్లు వెల్లడించింది.

దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్–2026 సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియెరోనిమస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ–టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని లోరియల్ అధికారికంగా ప్రకటించింది. ఈ కేంద్రం ద్వారా గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లైచైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక హబ్‌గా మారనుంది..డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, కృత్రిమ మేధ (ఏఐ), అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందించనున్నట్లు హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాల్లో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత పెరుగుతుందని చెప్పారు.

నవంబర్‌లో జరిగే జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను లోరియల్ ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావడంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని, ప్రభుత్వ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత అనుకూల నగరమని పేర్కొన్నారు.

**కొత్త రంగాల్లోనూ తెలంగాణ ముందంజ..**

మెడ్‌టెక్, హెల్త్‌టెక్‌తో పాటు బ్యూటీ–టెక్ వంటి కొత్త రంగాల్లోనూ తెలంగాణ ముందంజలో ఉందని మంత్రి అన్నారు. ఇప్పటికే మారియట్, వ్యాన్‌గార్డ్, నెట్‌ఫ్లిక్స్, మెక్‌డొనాల్డ్స్, హైనెకెన్,



జాగర్, కోస్ట్కో వంటి గ్లోబల్ సంస్థలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ గురించి ప్రతినిధి బృందం లోరియల్ అధికారులకు వివరించింది. జీసీసీతో పాటు రాష్ట్రంలో మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుపై కూడా అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వం లోరియల్‌ను ఆహ్వానించింది. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల అనుకూల వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తేయడం ఖాయం..!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోన్న తుగ్గగ్ పనులతో జంట నగరాల అస్థిత్వం దెబ్బ తింటుంది. సినిమా టిక్కెట్లు పెంచేది లేదని యూ టర్న్ తీసుకున్నారు. మున్సిపాలిటీల వారీగా బీఆర్ఎస్ ఇంచార్జ్‌లు నియమిస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల కోసం ప్రతీ ఉమ్మడి జిల్లాకు ఇంచార్జ్ నియమించామని.. 8 ఉమ్మడి జిల్లాల సన్నాహక సమావేశాలు పూర్తి చేశామని పేర్కొన్నారు. జిల్లాల తొలగిస్తారని ప్రచారం జరుగుతుంది. దీనితో చాలా చోట్ల ప్రజల్లో ఆందోళన ఉన్నదని కేటీఆర్ అన్నారు. కొత్త జిల్లాలు చేసిన పట్టణాల్లో జిల్లాలు ఎత్తేసారు అనే భావనలో ఉన్నారు. ప్రజలు అంతా కూడా ఆందోళనలో ఉన్నారు. జిల్లాల అంశాన్ని ప్రధాన అస్త్రంగా మున్సిపల్ ఎన్నికలలో ప్రచారం చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికల కో ఆర్డినేటర్లను పెడుతున్నాం.స్థానిక నాయకులు ఎవరికి టికెట్ ఇవ్వాలని డిసైడ్ చేస్తారు.ఎన్నికలు లేని నాయకులు, ఎమ్మెల్యేలను మున్సిపల్ ఎన్నికల దగ్గర ఇంచార్జ్ లుగా నియమిస్తాం.లోకల్ ఎన్నికలు కాబట్టి లోకల్ వాళ్లే ప్రచారం చేస్తారు.స్థానికత ఆధారంగా ప్రచారం నిర్వహించనున్నట్టు కేటీఆర్ వెల్లడించారు.స్థానిక సమస్యలను ఎజెండాగా ముందుకు తీసుకొని ముందుకు వెళ్తాం. ముఖ్యమంత్రి హార్వర్డ్ వెళ్లి మంచిగా తిరిగి వస్తారు అనుకుంటున్నా. పఠాన్ చెరువు ఎమ్మెల్యే కూడా మా బీఆర్ఎస్ పార్టీనే గెలిపించాలి అంటున్నారు. మేము కూడా అదే అంటున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.పార్టీ మారిన తర్వాత ఆయా నియోజకవర్గాలలో వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాటం చేస్తున్నారు.సింగరేణిపై మంత్రులు మాట్లాడడం లేదు. సింగరేణిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.ఒక్క వైపు ఫార్ములా ఈ అంటాడు. అందులో ప్రూవ్ చెయ్యి.ఇక్కడ ఫార్ములా ఈపై విచారణ అంటాడు. అక్కడ దావోస్‌లో గ్రీన్ కోతో చర్చలు జరుపుతున్నారు.ఒక్క దగ్గర మంచోళ్ళు అవుతారు. మరో దగ్గర చెడ్డోళు అవుతారు ఎలా..? హైద్రాబాద్ కార్పొరేషన్ ఒక్కటే ఉండే మేమేం మార్చలేదు. రేవంత్ రెడ్డి జవాబు చెప్పాలి. రేవంత్ రెడ్డి తుగ్లక్, సమాధానం చెప్పే వరకు ఆయన వెంబడి పడుతాం అన్నారు. రేవంత్‌లో రాము ఉన్నాడు.. రెమో ఉన్నాడని కేటీఆర్ అన్నారు. ఉదాహరణకు సినిమా టికెట్లు పెంచం అంటాడు , మరోవైపు సినిమా టికెట్లు పెంచుతూ జీవో ఇస్తారు. సర్వాయి పాపన్న పేరు మీద జనగామ జిల్లా చేస్తాం అన్నారు కానీ ఇప్పుడు మళ్ళీ అదే జిల్లాను తొలగిస్తాం అన్నారు. అందుకే ఆయన రాము రెమో అని అన్నానని చెప్పుకొచ్చారు కేటీఆర్.

## నాకేదైనా జరిగితే.. ఇరాన్ ఔట్

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడే కారణమని ఆయతుల్లా అలీ ఖమేనీ ఆరోపించగా.. ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని ఆ నిరసనకారులకు ట్రంప్ మద్దతు పలుకుతున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఖమేనీ పాలన అంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ నాయకుడే లక్ష్యంగా ఏదైనా దురాక్రమణ జరిగితే.. దానిని తాము దీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించింది. ఇక ఈ నిరసనల్లో 5వేల మంది మృతి చెందినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 26వేల మంది వరకు అరెస్టయినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ మరణాలకు అమెరికానే కారణమని ఖమేనీ నిందించారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ 47 మంది కమిషనర్ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ కమిషనర్‌గా (ఓడీ ప్రాతిపదికన).
నాగరాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎఎ), అమర్చింత మున్సిపాలిటీ.
కె. సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎఎ), మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్.
టి. రమేష్, మేనేజర్, బెల్లంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్
జె. సంపత్, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎఎ), ములుగు మున్సిపాలిటీ.
ఎం. రామచంద్రరావు, ఎంపీఓ, కల్లూరు మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్‌గా (ఓడీ ప్రాతిపదికన).
ఎం. మునావర్ అలీ, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎఎ), తిరుమలగిరి మున్సిపాలిటీ.
జి. రాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎ), క్యాతనపల్లి మున్సిపాలిటీ.
పి. చంద్రశేఖర్ రావు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–ఎఎ), కొల్లాపూర్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చాయి.

## మున్సిపల్ ఎన్నికలకు జాగృతి దూరం

(మొదటి పేజీ తరువాయి)

జరిగే అవకాశం లేదని చెప్పారు. కావాలనే హరీశ్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చి డైవర్షన్ చేస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గుంపు మేస్త్రీ, గుంట నక్క కలిసే ఉన్నారంటూ విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో డ్రామా మొదలుపెట్టారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలోనే ఎందుకు విచారణ చేపట్టారని ఆమె ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇప్పట్లో తుది దశకు చేరుతుందని తాను అనుకోవడంలేదని ఆమె చెప్పారు. విచారణ వల్ల తనలాంటి బాధితులకు న్యాయం జరుగుతుందని భావించటంలేదని కవిత అన్నారు. పొలిటికల్ పవర్ బలహీన వర్గాలకు వచ్చినప్పుడే ఆ సమాజం బాగుపడుతుందన్నారు. చాలామంది ఎన్నికల్లో పోటీచేస్తామని అడుగుతున్నారని.. కానీ జాగృతి పూర్తిస్థాయి రాజకీయ పార్టీ కాలేదని వెల్లడించారు. యువత, మహిళలు ఎక్కడ పోటీచేసినా జాగృతి మద్దతిస్తుందని ఆమె స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు బీసీలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం వాటా ఇవ్వకుండానే ప్రభుత్వం ఎన్నికలకు వెళుతోందని విమర్శించారు. జిల్లాల పునర్విభజన ఎప్పుడు జరిగినా సికింద్రాబాద్‌ను జిల్లా చేయాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. పీవీ.నరసింహారావు పేరు ఏదో ఒక జిల్లాకు పెట్టాలని కూడా కవిత కోరారు.కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉద్యోగులు, యువతకు నష్టం జరిగిందని కవిత విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఐదు శాతం ఓపెన్ కోటాను నాన్ లోకల్‌గా మార్చడంతో రాష్ట్ర యువతకు నష్టం జరుగుతోందని తెలిపారు. జాగృతి తరపున అధ్యయనం చేస్తున్నామని.. జిల్లాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేస్తే నివేదిక ఇస్తామని తెలిపారు. కొత్త పార్టీ ఏర్పాటు కసరత్తు వేగంగా జరుగుతోందని.. జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి ప్రక్రియ పూర్తవుతుందో లేదో చూడాలని కవిత అన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద కూడా అడ్డంకులు సృష్టించే అవకాశం లేకపోలేదని తెలిపారు. పార్టీకి ఇంకా ఏ పేరు అనుకోలేదని.. తెలంగాణ రాష్ట్ర జాగృతి సమితి అని కొందరు సూచించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ అంశానికి కూడా న్యాయం చేస్తారన్న నమ్మకం తనకు లేదని అన్నారు. నైని బొగ్గు గని అంశం కంటే సింగరేణికి కొత్త బొగ్గు గనులు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ విధానం ఎప్పటి నుంచో ఉందని.. కాంగ్రెస్ వచ్చిన తర్వాత దాన్ని ప్రధాన నిబంధనగా పెట్టారని.. కొంత మందికి మాత్రమే సెలెక్టివ్‌గా ఇస్తున్నారని తెలిపారు. విచారణ చేయించాల్సిన కాంగ్రెస్ నేతలు లేఖ రాయాలని కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. జాగృతి అధికారంలోకి వచ్చిన తర్వాత.. 2014 నుంచి సమగ్ర విచారణ చేస్తామని తెలిపారు.గతంలో సర్పంచ్‌లను కలవని వారు ఇప్పుడు వారితో కలిసి ఫోటోలు దిగుతున్నారని.. ఇది సంతోషించదగ్గ విషయమన్నారు . దాంతో సామాజిక తెలంగాణ వైపు కొంత మేర అడుగులు పడుతున్నాయని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారన్న అంశం గురించి తనకు తెలీదని, తాను ఇప్పుడు బీఆర్ఎస్‌లో లేనని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ 300 డివిజన్ల ప్రతిపాదన బీఆర్ఎస్ హయాంలోనిదే అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కొనసాగిస్తోందన్నారు. జాగృతి జనంబాట ముగింపు మార్చి పదో తేదీన అనుకుంటున్నామని.. ఆ తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ మంత్రుల అవినీతిపై ర్యాంకులు ప్రకటిస్తామని కవిత పేర్కొన్నారు.'నా టార్గెట్ హరీశ్ రావు, ఇంకా పెద్ద టార్గెట్ కూడా ఉంది. కేటీఆర్‌ను కూడా విమర్శించాను. బలమైన రాజకీయ భవిష్యత్ కోసం పటిష్ట ఎజెండా సిద్ధం చేసుకుంటున్నాను, ఈ దశలో నాకు నేనుగా ఎవరితోనూ మాట్లాడను. రాజకీయ కన్సల్టెన్సీలు ఎవరినీ నేను సంప్రదించలేదు, నన్ను సంప్రదించిన కొంత మందితో మాట్లాడాను' అని కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తెలంగాణ ఉద్యమకారులు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారులను పట్టించుకోలేదని విమర్శించారు. ట్యాంక్‌బండ్ మీద ఆంధ్రావారి విగ్రహాలు తప్ప తెలంగాణ మహనీయులవి లేవని.. వాళ్ల విగ్రహాలు తొలగించాలని తాము అనటం లేదని.. అవసరం వస్తే తప్పదంటూ వ్యాఖ్యానించారామె. అమరజ్యోతిపై అవినీతి మరకలు పడ్డాయని, అందుకే దాన్ని ఓపెన్ చేయడంలేదని కవిత అన్నారు.ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ ఉద్యమకారుల విగ్రహాలు ఉండాలన్నారు. ముచ్చర్ల సత్యనారాయణ విగ్రహం అక్కడ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఐదు శాతం ఓపెన్ కోటాను నాన్ లోకల్ గా మార్చడంతో రాష్ట్ర యువతకు నష్టం జరుగుతోందన్నారు. జాగృతి తరఫున అధ్యయనం చేస్తున్నాం, జిల్లాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేస్తే నివేదిక ఇస్తామన్నారు. కొత్త పార్టీ ఏర్పాటు కసరత్తు వేగంగా జరుగుతోందని.. జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి ప్రక్రియ పూర్తవుతుందో లేదో చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద కూడా అడ్డంకులు సృష్టించే అవకాశం లేకపోలేదని అభిప్రాయ పడ్డారు. పార్టీకి ఇంకా ఏ పేరు అనుకోలేదు, తెలంగాణ రాష్ట్ర జాగృతి సమితి అని కొందరు సూచించారని స్పష్టం చేశారు.

## రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడగలరా..?

(మొదటి పేజీ తరువాయి)

నోటీసులు ఇస్తే బాధ ఎందుకని అన్నారు.సింగరేణి విషయంలో పస లేని ఆరోపణలు చేస్తున్నారని.. సింగరేణి కాంట్రాక్టులు బీఆర్ఎస్ హయాంలో జరిగినవి అని అన్నారు. ఆరోపణలపై ఆధారాలు ఉంటే చర్చకు సిద్ధంగా ఉన్నామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 20 శాతం ఎక్సెస్ టెండర్లు జరిగాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినాక అన్ని శాఖలను ప్రక్షాళన చేశామని.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోపాలను సరిదిద్దుతున్నామని అన్నారు. కేటిఆర్, హరీష్ రావులు బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని.. ఎన్నికల లబ్దికోసం నోటీసులు ఇస్తున్నారనేది సమంజసం కాదని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత నేరం..అలాంటి నేరం బీఆర్ఎస్ నాయకులు చేసారని.. సినీ నిర్మాత తారలు,స్వంత పార్టీ ఎమ్మెలేల ఫోన్ లు కూడా ట్యాప్ చేసారని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిట్ విచారణలో రాజకీయ కక్ష కోణం ఎక్కడా లేదని.. నిజంగా తప్పు చేయకుంటే వివరణ ఇచ్చే ప్రయత్నం చేయాలని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన సింగరేణి కాంట్రాక్టులు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన టెండర్లపై చర్చకు రావాలని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిఎం బంధువు సృజన్ రెడ్డిపై ఆరోపణలు చేసి దెబ్బ తీయాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

## సభకు రాకుండా జీతాలు తీసుకుంటే ఎలా..?

(మొదటి పేజీ తరువాయి)

వివిధ రాష్ట్రాల శాసనసభాపతుల సదస్సులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజల పట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం అనే అంశంపై అయ్యన్న మాట్లాడారు. కొందరు ఎమ్మెల్యేలు ఒక్క చర్చలోనూ పాల్గొనలేదు. సభకు రాకుండా జీతాలు తీసుకుంటున్నారు. అలాంటి వారిని చూస్తుంటే వేదన కలుగుతోంది. అనైతిక ప్రవర్తనతో ప్రజల దృష్టిలో చులకన కాకుండా ఉంటారా?ఇలాంటి సభ్యుల వ్యవహారశైలిని నిషేధించే నిబంధనలేవీ లేవు. చట్టసవరణ చేసి సభకు రాని సభ్యులకు 'నో వర్క్–నో పే' నిబంధన అమలు చేయాలి. అలాంటి వారిని రీకాల్ చేసేలా ప్రజలకు హక్కు కల్పించాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. 2024 ఎన్నికల తర్వాత అసెంబ్లీకి ఒక్కరోజు కూడా రానివారు ఉన్నారని.. కనీసం సభలో జరిగే ప్రశ్నోత్తరాలు, చర్చల్లోనూ పాల్గొనడం లేదని ఏపీ స్పీకర్ పేర్కొన్నారు. దీనివల్ల తమను ఎన్నుకున్న ప్రజలకు అన్యాయం చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు.

ఇలా సభకు హాజరు కాకపోవడం వలన ప్రజల దృష్టిలో సభ్యులు చులకనవుతున్నారని చెప్పుకొచ్చారు. సభకు హాజరు కాకుండానే వారు వేతనాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారంగా.. 'నో వర్క్.. నోపే' విధానానికి అనుగుణంగా చట్టం చేయాలని.. అఖిల భారత సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని కోరారు. సభకు రానివారిని రీకాల్ చేసే హక్కు ప్రజలకు కల్పించేలా చట్టం చేయాలని ఏపీ స్పీకర్ ప్రతిపాదించారు.




తెలుగు దినపత్రిక https://aksharagalam.com

అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్


# వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలు విడుదల



**ఆమనగల్లు, జనవరి 21 (అక్షర గళం):** కడ్తాల్ పట్టణ కేంద్రంలో వెలసిన శ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 03 వరకు జరగనున్నాయి. బుధవారం పట్టణ కేంద్రంలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల్లో నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృప పొందాలని ఆకాంక్షించారు.



# వ్యక్తిగత పరిశుభ్రతతో జబ్బులు దూరం

**- డాక్టర్ మైమున బేగం**

**ఆమనగల్లు, జనవరి 21( అక్షర గళం):** వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే జబ్బులు దూరం అవుతాయని వైద్యురాలు మైమున బేగం అన్నారు. బుధవారం ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామ సమీపంలో ఉన్న మదీనా మదర్సాలో ఆమనగల్లు పీ.హెచ్.సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్యులు డా. మైమున బేగం ఆధ్వర్యంలో 72 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వంట గది, త్రాగు నీటి సరఫరాను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు విజయ లక్ష్మి, విజయ, సీహెచ్ఓ చంద్రశేఖర్, హెచ్ఈఓ హలీం, సల్మా, సరోజ మరియు మదర్స ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# లక్ష్మి నర్సింహ్మా రెడ్డి.. యువతకు ఆదర్శం

**ఆమనగల్లు, జనవరి 21 (అక్షర గళం):** మనసుపెట్టి కష్టపడితే ఎంతటి విజయనైనా సాధించవచ్చని నిరూపించిన లక్ష్మి నర్సింహ్మా రెడ్డి యువతకు ఆదర్శమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. కడ్తాల్ మాజీ సర్పంచ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి జర్నలిజం విభాగంలో మాస్టర్స్ పట్టా సాధించిన సందర్భంగా ఆయనను పలువురు నాయకులు అభినందించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఆయన నివాసంలో లక్ష్మి నర్సింహ్మా రెడ్డిని ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. ప్రజాసేవతో పాటు విద్యను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న తీరు ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. సమాజంలో మార్పు తీసుకు రావాలంటే అవగాహనతో కూడిన విద్య అవసరమని, జర్నలిజం, న్యాయ శాస్త్రం, కంప్యూటర్ సైన్సెస్ వంటి రంగంలో లక్ష్మి నర్సింహ్మా రెడ్డి ఉన్నత చదువులు పూర్తి చేయడం అభినందనీయమని తెలిపారు.

సమాజ సేవలో విద్యాభ్యాసం ప్రజల సమస్యలను మరింత సమర్థవంతంగా వెలుగులోకి తీసుకురావడానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత చదువుతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి ముందుకు రావాలని జైపాల్ యాదవ్ కోరారు.

ప్రజాసేవ, విద్య రెండింటినీ సమంగా ముందుకు తీసుకెళ్తూ లక్ష్మి నర్సింహ్మా రెడ్డి చూపుతున్న మార్గం నేటి యువతకు ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో మాధారం మాజీ సర్పంచ్ లక్ష్మి దేవి నర్సింహ్మా గౌడ్, మాజీ సర్పంచులు కృష్ణయ్య, వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి, బాలకృష్ణ, రాములు నాయక్, కోట్యా నాయక్, శ్రీకాంత్ యాదవ్, నరేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.



# భక్త మార్కండేయ మహర్షి జయంతి

**ఆమనగల్లు, జనవరి 21 (అక్షర గళం):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలో బుధవారం శివభక్త మార్కండేయ దేవస్థానంలో శ్రీ మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల కలశాలతో ఊరేగించారు. పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ.. పద్మశాలీల కులదైవం మార్కండేయ స్వామి అని తెలిపారు. అధ్యక్షుడు బాలకృష్ణయ్య, గుర్రం కేశవులు, ఏలే నిరంజన్, శివలింగం, రవి, మహేష్, యాదగిరి, శ్రీధర్ ఉన్నారు.

# గాంధీ పేరును పునరుద్ధరించాలి

- **ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
- **ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర**
- **జీరామ్ జీ చట్టం రద్దు చేసే వరకు పోరాటం**




**ఆమనగల్లు, జనవరి 21 (అక్షర గళం):** ఉపాధి హామీ పథకానికి తిరిగి మహాత్మా గాంధీ పేరును పునరుద్ధరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పేదల వలసలు నివారించి ఉన్న ఊరిలోనే ఉపాధి కల్పించాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీ యూపీఏ హయాంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చిందన్నారు. గతంలో కేంద్రం వందశాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేయగా ప్రస్తుతం 60 శాతం బరిస్తూ మిగిలిన 40శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమన్నారు.

కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్ గౌడ్, సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్యా నాయక్, నాయకులు చేగురు వెంకటేష్, మాజీ జడ్పిటిసి అద్దాల రాములు గౌడ్, వెంకటయ్య గౌడ్, కానుగుల దశరథం, కర్ణాకర్ గౌడ్, రవి, ఉపసర్పంచ్ నర్సింహా, వార్డు సభ్యులు పోలే దుర్గయ్య, బాలామణి, మంజుల, రజిత, శ్రీనివాస్, మహేష్ మరియు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్ఈయుఐ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

**కల్వకుర్తి డీఎస్పీ సాయి వెంకట్‌రెడ్డి**

**జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలలో పాల్గొని ర్యాలీ నిర్వహించిన విజ్డమ్ ద స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల అధ్యాపకులు**

**కల్వకుర్తి జనవరి 21 (అక్షర గళం):** రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచునని కల్వకుర్తి డీఎస్పీ సాయిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించడం వంటి అంశాలపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రతి వాహనదారుడు రహదారి నిబంధనలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేమంగా ఇంటికి చేరాలంటే రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున, ఎస్సైలు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





# అంకితభావంతో పనిచేసిన సేవలకు గుర్తింపు లభిస్తుంది

**మహబూబ్నగర్ రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్**

**కల్వకుర్తి అసిస్టెంట్ డిపో మేనేజర్ శ్వేత సేవలు భేష్**

**కల్వకుర్తి, జనవరి 21 (అక్షర గళం):** విధుల పట్ల అంకితభావం నిబద్ధతతో పని చేస్తే అసాధ్యమైనది ఏదైనా సాధించవచ్చు అని చేసిన సేవలకు ఎక్కడికి వెళ్లినా గుర్తింపు లభిస్తుందని మా అన్న రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం మహబూబ్నగర్ రివిజన్ కార్యాలయంలో కల్వకుర్తి అసిస్టెంట్ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన అసిస్టెంట్ డిపో మేనేజర్ శ్వేత ను ఆర్ఎం సంతోష్ కుమార్ డిప్యూటీ ఆర్ ఎం లక్ష్మి ధర్మాను ఘనంగా పూలమాలలు శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాన్ని అందజేశారు.

కల్వకుర్తి డిపోలో నాలుగు సంవత్సరాలుగా అంకిత భావంతో విధుల పట్ల అలసత్వం లేకుండా కష్టపడి పనిచేసినందుకు గుర్తింపు లభించిందని అసిస్టెంట్ మేనేజర్ శ్వేత అన్నారు. కల్వకుర్తి డిపో అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశానని డిపోను లాభాల బాటలో పట్టించేందుకు శాయశక్తుల కృషి చేశానని ప్రయాణికులకు అనుగుణంగా రవాణా సేవలు కల్పించేందుకు రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆయారూట్ల ను సర్వే చేసి బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి బస్సు రవాణా సౌకర్యం అందే విధంగా లింగాల్ రూట్ లో సెక్టార్ను నడిపించామని ప్రయాణికులకు అందుబాటులో ఉంటూ సేవలను అందించడం వృత్తి పట్ల గౌరవం పెరిగిందని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లతో సమన్వయంగా వ్యవహరించడంతో లాభాల బాటకు కారణం అన్నారు.

కల్వకుర్తి డిపోను దశలవారీగా అభివృద్ధి కి కృషి చేశానని అన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండి వైస్ చైర్మన్ సజ్జనర్ ఇచ్చిన ఛాలెంజ్ ప్రోగ్రామ్ కు దసరా దీపావళి సంక్రాంతి రాఖీ పండుగలకు ఇచ్చిన ఆదేశాల మేరకు టార్గెట్ ను పూర్తి చేసి గత ఆర్టీసీ ఎండి వైస్ చైర్మన్ సజ్జనర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని సాధించడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 97 డిపోలో కల్వకుర్తి డిపోను మొదటి స్థానంలో నిలబెట్టినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డిపో మేనేజర్ యాదయ్య కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమాశంకర్ గౌడ్ రివిజన్ పరిధిలోని అన్ని డిపోలో అసిస్టెంట్ డిపో మేనేజర్లు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్




**ఆమనగల్లు, జనవరి 21 (అక్షర గళం):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని అయ్యప్ప కొండ ప్రాంగణంలో జబ్బు మహేష్ జ్ఞాపకార్థం మిత్రమండలి సభ్యులు కొమ్ము ప్రసాద్, చలి చీమల సతీష్ నాగిళ్ళ లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపాలిటీ స్థాయి టోర్నమెంట్ కొనసాగుతుంది. స్పాన్సర్ కోట మహేష్ హాజరై బుధవారం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఓటమిని తొలి మెట్టుగా తీసుకుని ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో వస్పుల రంజిత్, జెక్క మహేష్, భాస్కర్, పరమేష్, శివ, సూర్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ వారికి జైలు శిక్ష జరిమానా

**- కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి**

**కల్వకుర్తి జనవరి 21 (అక్షర గళం):** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచగా ముగ్గురికి జైలు శిక్షతోపాటు జరిమానా మిగితా ముగ్గురికి 1600 జరిమానా సోషల్ సర్వీస్ విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి బుధవారం మీడియాకు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డవారిని కోర్టులో హాజరు పరచగా జూనియర్ సివిల్ జడ్జ్ కావ్యజాడ శిక్షను విధించినట్లు తెలిపారు కల్వకుర్తి మండల పరిధిలోని నకిన మౌని గణేష్ ఒకరోజు జైలు శిక్ష వంద రూపాయల జరిమానా విధించగా పంజగుల గ్రామానికి చెందిన జక్కుల ఆంజనేయులుకు రెండు రోజుల జైలు శిక్షతోపాటు 100 రూపాయల జరిమానా వనపర్తి జిల్లా బండరాయి పాకుల గ్రామానికి చెందిన గన్నోజ్ వినోద్ కుమార్ కు రెండు రోజుల జైలు శిక్షతోపాటు వంద రూపాయల జరిమానా కల్వకుర్తి మండల పరిధిలోని గుండూర్ గ్రామానికి చెందిన నాకిన మౌని గణేష్ కు ఒకరోజు జైలు శిక్షతోపాటు వంద రూపాయల జరిమానా విధించినట్లు వివరాలను ఎస్ఐ మాధవరెడ్డి వెల్లడించారు.

## నాగర్ కర్నూల్ జిల్లాకు ఎన్నికల ప్రచారం కోసం పర్యటించనున్నతీన్మార్ మల్లన్న

**కల్వకుర్తి జనవరి 21(అక్షర గళం):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరుపున నాగర్ కర్నూల్ జిల్లా లోని నాగర్ కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ లలో పర్యటించనున్నారు. ఆయా మున్సిపాలిటీ లలోని అన్ని వార్డులలో పార్టీ అభ్యర్థులు పోటీలో ఉండనున్నారు.. అభ్యర్థులకు పార్టీ నుండి అభ్యర్థులకు బీఫారం ఇవ్వనున్నారు. అభ్యర్థులు వేసే నామినేషన్‌లో కూడా తీన్మార్ మల్లన్న పాల్గొంటారని పేర్కొన్నారు.



## అగ్ని ప్రమాదంలో రూ.3.5 లక్షల సామగ్రి దగ్ధం

**జరిగిన ప్రమాదాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కల్వకుర్తి జనవరి 21(అక్షరగళం):** కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామంలో ఉన్న లారీ, కారు, బైక్ సర్వీసింగ్ సెంటర్లో అగ్ని ప్రమాదం జరిగి రూ.3.5 లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు



తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి అగ్ని ప్రమాదం పై ఆరా తీశారు. తక్షణం 5000 ఆర్థిక సహాయం అందించారు. ఈ ప్రమాదంపై విచారణ జరిపి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వెంట పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొనారు.

## మండల అభివృద్ధి కోసం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని కలిసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి


**కల్వకుర్తి, జనవరి 21( అక్షర గళం):** ఊరుకొండ మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధి కోసం వివిధ సమస్యలను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని మంగళవారం ఊరుకొండ పేట శ్రీశ్రీశ్రీ పబ్బాతి



ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలో పాల్గొన్న ఎమ్మెల్యేను కలిసి సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సానుకూలంగా స్పందించారని సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జికినాలపల్లి మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జికినాలపల్లి గ్రామ అభివృద్ధి కోసం సమస్యలను వివరించినట్లు తెలిపారు.

## కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

**కల్వకుర్తి జనవరి 21 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణంలోని 7వ వార్డుకు చెందిన సుమారు 20 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర



అధికార ప్రతినిధి ఠాగూర్ బాలాజీ సింగ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్లో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# ఆరోగ్యం మనందరి బాధ్యత

**యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి : జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి**

**ఆమనగల్లు, జనవరి 21 (అక్షర గళం):** ఆరోగ్యం మన అందరి బాధ్యతని, యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. బుధవారం ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన ఎడవల్లి రామకృష్ణ ఏర్పాటు చేసుకున్న ఫ్రూ వేద (మీ ఆరోగ్యం మా బాధ్యత) స్టార్టప్‌ను తల్లోజు ఆచారి చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్లు మన శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మన మానసిక స్థితిని మెరుగుపరిచే వివిధ పోషకాలతో నిండి ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు సంతోషకరమైన జీవితానికి సరైన ఆహార ఎంపికలు తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని ఆచారి సూచించారు. యువత ఇలాంటి ఆలోచనలతో ముందుకు రావడం ఎంతో గొప్ప విషయమని అని అన్నారు. యువత ప్రైవేట్ రంగాల్లో అంది వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల న్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. రామకృష్ణ దంపతులను తల్లోజు ఆచారి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కండె





హరిప్రసాద్, మాజీ కౌన్సిలర్ దివ్య శ్రీకాంత్ సింగ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు మేడిశెట్టి శ్రీధర్, ప్రముఖ యూట్యూబర్ రేవల్లి రాజు, అడ్వకేట్ రామ్ చందర్ నాయకులు అచ్చయ్య, జంతుక శంకర్, నరేందర్ రాథోడ్, సీతారాం, సురేష్ నాయక్, లండం మల్లేష్, ఉదయ్, మురళి, నరేష్, అంజు తదితరులు ఉన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ

**ఆమనగల్లు, జనవరి 21 (అక్షర గళం):** నట్టల నివారణతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయని లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం కడ్తాల్ మండల పరిధిలోని కొండ్రిగాని బావి తండాలో ఆవు దూడలకు నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చేగురు వెంకటేశ్, క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు అండగా పాల ఉత్పత్తిదారులకు చేయూత అందించడానికి క్లబ్ ద్వారా నట్టల నివారణ మందులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఆరోగ్యవంతమైన దూడలను గుర్తించి పాడి రైతులకు బహుమతులను మరియు ప్రోత్సాహకాలను అందించినట్లు అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ముందుకు వచ్చి ఉపాధి కల్పనకు ఆవులను, గేదెలను ఏర్పాటు చేసుకుని పాల ఉత్పత్తి పెంచాలని వారు ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని సూచించారు. పాడి పరిశ్రమకు ముందుకు వచ్చే వారికి పాడి పరిశ్రమ ద్వారా సహకారం అందిస్తామని వారు అన్నారు. తండాలో ఉన్న 30 దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ





చేసినట్లు క్లబ్ పీఆర్ఓ పాషా తెలిపారు. ఆరోగ్యవంతమైన దూడలు 5 నెలలు, 3 నెలలు, 2 నెలలుగా ఉన్న దూడలను గుర్తించి ఎంపిక చేసిన పశుపోషకులకు బహుమతులు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గంప శ్రీను, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ శారదా బిక్కు నాయక్, క్లబ్ సభ్యులు బిచ్చ నాయక్, జహంగీర్ అలీ, రాజు యాదవ్, లక్ష్మణ్, దీప్లా, కిషన్, బీమా, రంగా తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

**మూడు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత**

**కల్వకుర్తి జనవరి 21 (అక్షర గళం):** కుటుంబ పెద్ద దిక్కుని కోల్పోయి మానసిక శోభను అనుభవిస్తు పేదరికంతో అల్లాడుతున్న కుటుంబాలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆ కుటుంబాలను ఆదుకుంటూ కొండంత అండగా భరోసా కల్పించారు





కల్వకుర్తి మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన రేవల్లి కృష్ణవేణి తోటపల్లి బాలమణి గుమ్మం కొండ జంగయ్య అనారోగ్యంతో మృతి చెందారు ఈ విషయాన్ని స్థానిక టిఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆ కుటుంబాలకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల ఆర్థిక సహాయం స్థానిక నాయకుల ద్వారా బాధ్యత కుటుంబాలకు అందజేశాలు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య మాజీ ఎంపీటీసీ శోభా



శేఖర్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ పాండు గౌడ్ బిఆర్ఎస్ పార్టీ మూడవ అవార్డు సభ్యులు ముత్యాల నరేష్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యాల రమేష్ జిల్లెల్ల గౌడ్ సంఘం అధ్యక్షులు జంగయ్య బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు గుమ్మకొండ రమేష్ యాదయ్య ఈదమయ్య గుమ్మకొండ వినయ్ కర్నాటి వెంకటేష్ పట్టపర్ల రామకృష్ణ గుమ్మకొండ క్రాంతి ఆటో పాండుగౌడ్ కర్నాటి కృష్ణయ్య గుమ్మకొండ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.







## రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి: ఎస్సై కురుమూర్తి

**వెల్దండ, జనవరి 21 (అక్షర గళం):** ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్సై కురుమూర్తి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని బుధార్ పేట ఆంజనేయస్వామి దేవాలయం నుండి శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలపై అవగాహన పెంపొందించుకొని తోటి వారిని చైతన్య పరచాలని కోరారు ముఖ్యంగా ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడంతోపాటు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదలు సంభవించి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ఆసుపత్రి పాలవుతున్నారని అలా జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై కురుమూర్తి తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఉపసర్పంచ్ ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను వార్డ్ సభ్యులు గుద్దేటి కిష్టాల్ ముదిగొండ రమేష్ దేవేందర్ వెంకటేష్, శేఖర్, నాయకులు పుల్లయ్య జంగిలి యాదగిరి మారేపల్లి శ్రీను ప్రవీణ్ కుమార్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి బడక రామకృష్ణ మంగళగిరి శ్రీను భరత్ గౌడ్, ఈదులపల్లి శ్రీను, పోలీస్ సిబ్బంది వెంకటరెడ్డి, శ్యామ్, నవీన్ యాదవ్ రవి, మల్లయ్య, చంద్రశేఖర్, రాఘవేందర్, మల్లేష్, శేఖర్, మహేష్ కృష్ణ తదితరులు ఉన్నారు.

## కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం


**ఆమనగల్లు,జనవరి 21(అక్షర గళం):** కడ్తాల్ మండలం మద్రిపల్లి గ్రామ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి నాగిరెడ్డి చెప్పారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఉడుతల యాదయ్య, ఉపాధ్యక్షుడిగా రాములు, కార్యదర్శిగా పెద్దయ్య, డైరెక్టర్లుగా నర్సింహా, జంగయ్య లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యా చౌహాన్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రకిరణ్, హెచ్.సీ చానా గౌడ్, ఈసీ లు ఉపేందర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ - హైదరాబాద్

ప్రతీకాత్మక చిత్రం




# ఆర్థిక కష్టాలతో.. కూతురు హత్య, కుటుంబం ఆత్మహత్యాయత్నం

### జగద్గిరిగుట్టలో కలచివేసిన విషాదం

### రెండు రోజుల మౌనం తర్వాత వెలుగులోకి వచ్చిన ఘటన

**అక్షరగళం, జగద్గిరిగుట్ట:**
తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లు ఓ కుటుంబాన్ని అతి భయానక నిర్ణయాల వైపు నడిపించాయి. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయనగర్ కాలనీలో చోటుచేసుకున్న ఈ హృదయ విదారక ఘటన స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ పోషణ భారం, మానసిక వేదనలతో కుంగిపోయిన తల్లిదండ్రులు కూతురిని హత్య చేసి, రెండు రోజుల పాటు ఆమె మృతదేహంతోనే ఇంట్లో గడిపి, చివరికి మిగిలిన సభ్యులంతా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు.

#### వివరాల ప్రకారం

ఆల్విన్ కాలనీ డివిజన్, విజయనగర్ కాలనీ లోని ఓ అపార్ట్‌మెంట్ G-1 ఫ్లాట్‌లో నివసించే సతీష్ కుమార్, ఆయన భార్య ఆమని, కుమారుడు నితిన్ (నితీష్) కుమార్, కూతురు శ్రీజవళి (18) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. పుట్టుకతో వికలాంగురాలైన శ్రీజవళిని రెండు రోజుల క్రితమే హత్య చేసినట్టు ప్రాథమిక సమాచారం. అనంతరం కుటుంబీకులు ఇంట్లోనే ఉండి ఎవరికి సమాచారం ఇవ్వకుండా గడిపినట్లు తెలుస్తోంది.

ఈ రోజు ఉదయం మిగిలిన ముగ్గురు చేతులు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. నాలుగు గంటల పాటు పరిస్థితి విషమంగానే ఉండటంతో, ప్రాణాలు పోకపోవడంతో కుమారుడు నితిన్ తన స్నేహితుడికి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

తీవ్ర గాయాలతో ఉన్న సతీష్ కుమార్, ఆమని, నితిన్‌లను చికిత్స నిమిత్తం రాందేవ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనకు దారి తీసిన కారణాలు, ఆర్థిక పరిస్థితులపై పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికానున్నాయి.



కళాశాలలో నిర్వహించిన వైద్య శిబిరం



అవగాహన ఒప్పందాలలో భాగంగా పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

# శివ శివాని విద్యాసంస్థలో పరిశ్రమ విద్య అనుసంధానం అవగాహన ఒప్పందాలు

- పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యా కార్యక్రమాలు
- ఆర్థిక-సాంకేతిక రంగంపై ప్రత్యేక సర్టిఫికేట్ కోర్సు
- ప్రముఖుల సమక్షంలో అవగాహన ఒప్పందాల మార్పిడి
- విద్యార్థులు-ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో రక్తదాన శిబిరం
- విద్యతో పాటు ఆరోగ్యానికి సమాన ప్రాధాన్యం

**అక్షరగళం, కొంపల్లి:**
విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ కళాశాలలో పరిశ్రమ–విద్య అనుసంధానానికి సంబంధించిన కీలక ఎంఓయులు జరిగాయి. పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పాటు, విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెగా వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు.

శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్‌లో రెండు కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి. మొదటగా, ప్రముఖ సాంకేతిక సంస్థ ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్తో శివ శివాని విద్యాసంస్థ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కార్యక్రమానికి ఐబీఎం సంస్థకు చెందిన డేటా మరియు కృత్రిమ మేధస్సు సేవల విభాగం అధిపతి జగదీశ భట్ ముఖ్య అతిథిగా హాజరై, అవగాహన ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఐబీఎం యొక్క ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వేదికలను విద్యా వ్యవస్థతో అనుసంధానించి, విద్యా అభ్యాసం మరియు వాస్తవ పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే ఈ ఒప్పంద ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

అదే విధంగా, వ్యయ లెక్కల రంగానికి చెందిన జాతీయ స్థాయి సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాతో కూడా శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, భీమా మరియు ఆర్థిక సాంకేతిక రంగాలలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా రూపొందించిన అధునాతన సర్టిఫికేట్ కోర్సును విద్యార్థులకు అందించడమే ఈ భాగస్వామ్య ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా బ్యాంకింగ్–ఆర్థిక సేవల మండలి చైర్మన్ చిత్తరంజన్ చట్టోపాధ్యాయ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశ్రమతో అనుసంధానమైన అభ్యాసం, వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధి, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న విద్య పట్ల ఈ భాగస్వామ్యం ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు.



ఇక ఇదే రోజున శివ శివాని విద్యాసంస్థ ప్రాంగణంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎలైట్ కోస్మో మరియు సంజీవని రక్తదాన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. రక్తదానం, కంటి పరీక్షలు, గుండె విద్యుత్ పరీక్షలను నిర్వహించగా, మొత్తం అరవై మంది విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. లయన్ ప్రవీణ్ మర్రి, శైలజ మర్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం విజయవంతంగా సాగింది.

ఈ కార్యక్రమంలో డా. కె. చ. అ. వి. ఎస్. ఎన్. మూర్తి (కేంద్ర మండలి సభ్యుడు, బ్యాంకింగ్–ఆర్థిక సేవల మండలి సభ్యుడు), చిత్తరంజన్ చట్టోపాధ్యాయ (చైర్మన్, బ్యాంకింగ్–ఆర్థిక సేవల మండలి), డా. శైలేష్ సంపతి (వైస్ ప్రెసిడెంట్ మరియు డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్), దీపికా సంపతి (వైస్ ప్రెసిడెంట్), డా. ఎన్.ఆర్.కే.ఎస్. చక్రవర్తి (ఇంచార్జి డైరెక్టర్), ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యతో పాటు ఆరోగ్యానికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్న సందేశంతో ఈ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# సింగరేణిని బంగారు బాతుగా వాడుకున్నారు

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ, అక్షరగళం:**
గత కొన్ని రోజులుగా ఒడిశాలోని నైనికోల్ బ్లాక్ అంశంపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. సింగరేణి సంస్థ తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని, 136 ఏళ్ల ఘన చరిత్ర ఉన్న ఈ సంస్థ బొగ్గు ఉత్పత్తిలో ఎన్నో రికార్డులు సృష్టించిందని గుర్తు చేశారు. ఎనిమిది జిల్లాలకు పైగా విస్తరించిన సింగరేణి తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించిందన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సింగరేణి అనేక సమస్యల్లో చిక్కుకుందని విమర్శించారు. లాభాల్లో ఉన్న సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోగశాలగా మార్చి అవినీతి అక్రమాలకు కేంద్రంగా చేసిందని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో సాగుతోందన్నారు.

సింగరేణిలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం, కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతం ఉన్నప్పటికీ, సంస్థపై నియంత్రణ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. బోర్డులో ముగ్గురు కేంద్ర ప్రభుత్వ డైరెక్టర్లు, ఏడుగురు రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టర్లు ఉంటారని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల పాటు 'కల్వకుంట్ల కుటుంబం' మాటే సింగరేణిలో చెల్లుబాటైందని ఆరోపించారు. టెండర్ల నుంచి చిన్న కాంట్రాక్టుల వరకు రాజకీయ జోక్యం పెరిగి సంస్థను సమస్యల్లోకి నెట్టేశారని మండిపడ్డారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి దాదాపు రూ.32 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. అవినీతి అక్రమాల కోసం సింగరేణిని బంగారు బాతుగా వాడుకున్నారని, కార్మికుల చెమట కష్టాన్ని దోచుకున్నారని విమర్శించారు. ఒకప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోయిన సింగరేణిని ఎన్డీఏ ప్రభుత్వం ఆదుకుంది. వాజ్‌పేయి హయాంలో రూ.684 కోట్ల అప్పుపై మారటోరియం విధించి సంస్థను కాపాడారు. కానీ 2014 తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ సింగరేణిని నష్టాల బాట పట్టించింది. తెలంగాణ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం నైనికోల్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించింది. 2015లోనే ఈ బ్లాక్ కేటాయించి, అవసరమైన అన్ని అనుమతులు ఇచ్చాం. అయితే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టెండర్లు పిలిచి చివరి నిమిషంలో వెనక్కు తగ్గారని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరిస్తోందన్నారు.

తాను 2024లో బొగ్గు శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం నైనికోల్ బ్లాక్‌కు తుది అనుమతులు వచ్చేలా చొరవ తీసుకున్నాను. అనేక సమీక్ష సమావేశాల్లో స్వయంగా మాట్లాడిన ఫలితంగా, 643 హెక్టార్ల అటవీ భూమిని సింగరేణికి అప్పగించేందుకు ఒడిశా ప్రభుత్వం 2024 జూలై 4న నిర్ణయం తీసుకుంది. తుది అనుమతులు వచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభించకుండా ఆలస్యం చేసింది. ఈ క్రమంలో అనేక అక్రమాలు జరిగాయనే వార్తలు రావడం దురదృష్టకరం. టెండర్లలో



'సైట్ విజిట్ సర్టిఫికేట్' నిబంధనను అవగాహన కోసం తీసుకొచ్చామని, కానీ సింగరేణి యాజమాన్యం దాన్ని తప్పనిసరి చేసి అవినీతికి బాటలు వేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇది సెల్ఫ్ డిక్లరేషన్ మాత్రమేనని తెలిపారు.

కోల్ బ్లాక్ కేటాయింపులపై సీబీఐ దర్యాప్తు కోరుతూ విమర్శలు చేస్తున్నవారికి అవగాహన లేదన్నారు. సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ చేసిన పనులను మరిచిపోయారా? అని ప్రశ్నించారు. సింగరేణికి ప్రస్తుతం రూ.47 వేల కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. దేశంలో ఏ కోల్ మైనింగ్ కంపెనీ ఇంతటి ఆర్థిక ఇబ్బందుల్లో లేదన్నారు. బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి జీతాలు చెల్లించే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో జీ11 గ్రేడ్ బొగ్గు ధర టన్నుకు రూ.4,088గా ఉండగా, కోలిండియాలో అదే బొగ్గు ధర రూ.1,605 మాత్రమేనని తెలిపారు. బొగ్గు నాణ్యత కూడా సింగరేణిలో 58 శాతం మాత్రమే ఉండగా, కోలిండియాలో 86 శాతం ఉందన్నారు. అవినీతి కారణంగా సింగరేణి అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడిందని హెచ్చరించారు.

సింగరేణి భూములు గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపించారు. అక్రమాలపై వచ్చిన కథనాలను బోర్డు సమావేశాల్లో కూడా చర్చించకుండా విస్మరిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తుకు ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుందని చెప్పారు. సింగరేణి కార్మికుల భవిష్యత్తును కాపాడేందుకు వ్యవస్థను పక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చి సింగరేణిని లాభాల బాటలో నడిపే బాధ్యతను కేంద్రానికి అప్పగిస్తే, ఆ బాధ్యత తీసుకునేందుకు సిద్ధమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# నాపై తప్పుడు ప్రచారం తగదు

- క్షమాపణ చెప్పకపోతే నిరాహార దీక్ష
- నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి

**న్యూఢిల్లీ, (అక్షరగళం):**
తనపై కావాలనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అవి వెంటనే సరిదిద్దుకుని క్షమాపణ చెప్పకపోతే గాంధీ మార్గంలో నిరాహార దీక్షకు కూర్చుంటానని నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి హెచ్చరించారు. బుధవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అలంపూర్‌లో ఇటీవల జరిగిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో తాను, స్థానిక ఎమ్మెల్యే విజయుడు కలిసి పాల్గొన్నామని తెలిపారు. ఎస్బీఐ ద్వారా ఐదు గ్రామాలను దత్తత తీసుకొని అక్కడి పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు, బాలికలకు సైకిళ్లు, ఉచిత ఆర్మీ సెలక్షన్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నామని చెప్పారు. విజయుడు ఎమ్మెల్యేగా, తాను ఎంపీగా ఉన్నప్పటికీ ఇద్దరం అన్నదమ్ముల్లా కలిసి పనిచేస్తున్నామని మల్లు రవి స్పష్టం చేశారు. ఇద్దరూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారమేనని, పార్టీలు వేర్వేరైనా ప్రజల కోసం కలిసి పనిచేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఒకే పార్టీ నుంచి గెలవాల్సిన అవసరం లేదన్నారు.

వడ్డేపల్లి మున్సిపాలిటీలో జరిగిన ఫౌండేషన్ కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారమే వ్యవహరించామని తెలిపారు. ఎమ్మెల్యే ముందు కొబ్బరికాయ కొట్టిన తర్వాత తాను కొట్టానని, ఎక్కడా ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదన్నారు. అయితే కొందరు తమను ఎమ్మెల్యే అనుచరులమని చెప్పుకుని కొబ్బరికాయల బస్తాను లాగేసి గొడవకు దిగారని వివరించారు.

గొడవ తీవ్రతరమై ఇరువర్గాల మధ్య రక్తపాతం జరిగే పరిస్థితి రావడంతోనే తాను జోక్యం చేసుకుని పోలీసులను పిలిచి గట్టిగా మాట్లాడాల్సి వచ్చిందన్నారు. గొడవ జరగకుండా ఉండేందుకే ఎమ్మెల్యే




విజయుడిని పక్కకు తీసుకెళ్లానని, అంతకుమించి ఆయనను దూషించడమో, కొట్టడమో అస్సలు జరగలేదని స్పష్టం చేశారు. ఈ ఘటనను కొందరు వక్రీకరించి తనపై భౌతిక దాడి చేశానని తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. కేటీఆర్ చేసిన ట్వీట్ కూడా తప్పుడు సమాచారంపై ఆధారపడి ఉండొచ్చని తెలిపారు. ఎమ్మెల్యే విజయుడిని తాను కొట్టానో లేదో ఆయన్నే అడగాలని సవాల్ విసిరారు. నిజానికి తన చర్య వల్లే పెద్ద గొడవ తప్పిందన్నారు.

1991 నుంచి ఎంపీగా పనిచేస్తూ అన్ని వర్గాలను కలుపుకొని ముందుకెళ్తున్నానని, అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్నానన్నారు.

ఈ ఘటనపై ఏ విధమైన విచారణైనా జరిపించుకోవచ్చని, నిజాలు బయటపడతాయని చెప్పారు. పూర్తి సమాచారం తెలుసుకోకుండా తనపై ఆరోపణలు చేసిన వారందరూ, తప్పుడు ప్రచారం చేసిన మీడియా సంస్థలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తన ప్రతిష్టతో పాటు కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీయాలని చేసిన ఈ ప్రయత్నాలకు క్షమాపణ చెప్పకపోతే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని నిరాహార దీక్షకు దిగుతానని ఎంపీ మల్లు రవి ప్రకటించారు.

# దావోస్ వేదికపై చిరు ప్రత్యక్షం

### సిఎం రేవంత్‌తో కలసి సదస్సుకు హాజరు

**హైదరాబాద్,జనవరి21 (అక్షరగళం):** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో మెగాస్టార్ చిరంజీవి తళుక్కుమన్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో కలిసి ప్రముఖ సినీనటుడు చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి తన కుటుంబంతో కలిసి విహారయాత్ర కోసం స్విట్జర్లాండ్‌కు వెళ్లారు. ఈ సమయంలోనే దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చిరంజీవిని అక్కడికి ఆహ్వానించారు. చిరంజీవి ఆ దేశంలోని జ్యూరిక్‌లో ఉన్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి.. సదస్సుకు రావాలని ఆహ్వానించడంతో ఆయన కూడా హాజరయ్యారు. సదస్సు వేదికపై ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్ ను చిరంజీవి చూశారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ అభివృద్ధి



దృక్పథాన్ని ఈ డాక్యుమెంట్ ప్రతిబింబించింది. అనంతరం చిరంజీవితో రేవంత్ మాట్లాడుతూ ..కుటుంబసభ్యులతో కలిసి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా చూశానని.. ఎంతో ఆస్వాదించానని తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవికి సిఎం అభినందనలు తెలిపారు.

# నిరాధార ఆరోపణలతో ప్రజలు హర్షించరు

### మాజీ మంత్రుల విమర్శలపై పొన్నం ప్రభాకర్ స్పందన

**హైదరాబాద్, (అక్షర గళం):** నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అధికారంలో ఉన్న ప్రభుత్వంపై బురదజల్లితే ప్రజలు హర్షించరని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి గనుల అంశంపై మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని ఆయన ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గనులను ఎక్సెస్‌లో ఇచ్చిందని, తాము మైనస్‌లో ఇచ్చామని వారు చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో 21 గనులు కేటాయిస్తే, ఒక్క గనినీ మైనస్‌లో ఇవ్వలేదని తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వం నాలుగు గనులు కేటాయిస్తే, వాటిలో ఎక్సెస్ రేటు సగటున 38 శాతం ఉందని, గత ప్రభుత్వంలో అది 2?3 శాతాన్ని కూడా దాటలేదన్నారు. ప్రభుత్వం తప్పు చేసినట్టుగా చూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014 నుంచి ఇచ్చిన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులకు సంబంధించి 20 కేటాయింపులు జరిగాయని, వాటిలో ఒక్కటే 37 శాతం ఎక్సెస్‌తో ఇచ్చారని చెప్పారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఇప్పటివరకు ఐదు కేటాయింపులే జరిగాయని వివరించారు. సింగరేణిలో గత పదేళ్లుగా జరిగిన అక్రమాలపై బీఆర్ఎస్ నేత కవిత పలుమార్లు ప్రస్తావించారని గుర్తుచేశారు.

ప్రభుత్వంపై దృష్టి మరల్చేందుకే ఈ ఆరోపణలన్నీ చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. ముఖ్యమంత్రి విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత 2014 నుంచి 2026 జనవరి వరకు జరిగిన గనుల కేటాయింపులపై విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు హరీశ్‌రావు లేఖ రాయాలని సూచించారు. హిల్ట్ పాలసీపై అనేక ఆరోపణలు చేసిన వారు, అసెంబ్లీలో చర్చకు వచ్చినప్పుడు మాట్లాడకుండా తప్పించుకున్నారని విమర్శించారు. కృష్ణ జలాల అంశాన్ని సెంటిమెంట్‌గా మార్చి రాజకీయ రంగు పులుమే ప్రయత్నం చేశారన్నారు. శాసనసభ వేదికగా జవాబు చెప్పలేక సభను బహిష్కరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. టెలిఫోన్ ట్యాపింగ్ అంశంపై కేటీఆర్ సోదరి, హరీశ్‌రావు మరదలు కవిత లేవనెత్తిన ప్రశ్నలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్మే బలహీన వర్గాల పార్టీ అని, బీఆర్ఎస్ మాత్రం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. 2017 మే 1న బీఆర్ఎస్ హయాంలో ఒక కంపెనీకి 35.57 శాతం ఎక్సెస్‌తో గనిని కేటాయించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2025 ఏప్రిల్, మే, జూలై, అక్టోబర్ నెలల్లో ప్రాజెక్టులపై సైట్ ఇన్‌స్పెక్షన్లు జరిగాయని తెలిపారు. టెండర్ ప్రక్రియలు గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని చెప్పారు.

2014 నుంచి 2025 అక్టోబర్ వరకు జరిగిన అన్ని గనుల కేటా



యింపులపై విచారణకు సిద్ధమని స్పష్టం చేశారు. నైని బ్లాక్‌ను బీఆర్ఎస్ హయాంలో 38 శాతం ఎక్సెస్‌తో కేటాయించారని, ఆ టెండర్ రద్దైందని తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకపోయినా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాపాలన ప్రభుత్వాన్ని అస్తవ్యస్తం చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో బాధ్యతాయుత ప్రతిపక్షంగా ప్రభుత్వంతో కలిసి ఢిల్లీ వెళ్లాలని కోరినా, బీజేపీ చేతుల్లో సురక్షితంగా ఉండాలనే ఉద్దేశంతో సీబీఐ విచారణ కోరుతున్నారని విమర్శించారు. అందుకే బీజేపీ, బీఆర్ఎస్ వేరు కాదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ కోరుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఆదేశించడంలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఈ అంశం చర్చకు రాకుండా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి నాటకం ఆడుతున్నాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని, ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 16 పార్లమెంట్ స్థానాలకు మంత్రులను ఇన్‌చార్జీలుగా నియమించినట్టు తెలిపారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, సన్నవడ్లకు బోనస్, రుణమాఫీ, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.







# తెలంగాణ ప్రణాళికలపై 'టాటా' ఆసక్తి

### సీఎం రేవంత్ రెడ్డితో టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో భేటీ

**దావోస్/హైదరాబాద్, (అక్షర గళం):** ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణలో పారిశ్రామిక అనుకూల వాతావరణం, ప్రభుత్వ విధానాలు, "తెలంగాణ రైజింగ్ విజన్?2047" తదితర దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధమైన విధానాలు అమలు చేస్తోందని, పెట్టుబడులు మాత్రమే కాక, ప్రభుత్వ విధానాలు, ఫ్యూచర్ విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ముందుకు వెళ్తోందని తెలిపారు. టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్, తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను ప్రశంసిస్తూ, భవిష్యత్ అవసరాలకు ప్రణాళికాబద్ధంగా ఆలోచిస్తున్న విధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని ప్రధాన క్రీడా మైదానాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనే దృక్పథాన్ని పంచుకున్నారు. ఛైర్మన్ చంద్రశేఖరన్, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వామ్యం కోసం ప్రభుత్వం తో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. దేశంలో ప్రతిభ ఉన్నా, దానికి తగిన మౌలిక సదుపాయాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 65 ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా, పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్ సెంటర్లుగా అభివృద్ధి చేసే ప్రణాళికలను వివరించారు. టాటా టెక్నాలజీస్‌తో కలిసి యువత నైపుణ్యాల అభివృద్ధిపై ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. అలాగే, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఆనంద్ మహీంద్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

2036 ఒలింపిక్స్‌లో భారత్ పతకాలు సాధించేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ప్రణాళికలు రూపొందించడం అంశాలను చర్చించారు. హైదరాబాద్‌లో చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై టాటా ఛైర్మన్ ఆసక్తి చూపారు. రాజస్థాన్, మహారాష్ట్రలోని నీటి వనరుల పునరుద్ధరణలో టాటా గ్రూప్ అనుభవాన్ని గుర్తు చేస్తూ, మూసీ అభివృద్ధిలో భాగస్వామిగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి, మూసీ నది చుట్టూ ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో హోటళ్లు, రిసార్టులు ఏర్పాటు చేసే అంశాలను చర్చించారు. మేడారం, వేములవాడ, భద్రాచలం వంటి ఆలయ ప్రాంతాల్లో హోటళ్ల ఏర్పాటులో టాటా గ్రూప్ ఆసక్తి చూపింది. శ్రీశైలం రహదారి వెంబడి అంతర్జాతీయ స్థాయి రిసార్టులు ఏర్పాటు చేయడంపై సానుకూలంగా స్పందించారు. ఏఐ డేటా సెంటర్లు, సెమీకండక్టర్ పరిశ్రమలు, ఈవీ తయారీ రంగాల్లో తెలంగాణలో కొత్త పరిశ్రమలు నెలకొల్పే అవకాశాలపై టాటా ఛైర్మన్ ఆసక్తి వ్యక్తం చేశారు. సదస్సులో మంత్రి డి. శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉన్నతాధికారులు మరియు ఇతర ప్రభుత్వం అధికారులు పాల్గొన్నారు. ఈ భేటీ ద్వారా తెలంగాణలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, యువత నైపుణ్యాల పెంపు, క్రీడా, పర్యావరణ ప్రాజెక్టులు తదితర పథకాల అమలుపై సానుకూలత వచ్చింది.

## కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి
# సంకల్పానికి కదులుతున్న పల్లెలు

- బెల్ట్ షాపు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకోవడానికి ర్యాలీలు
- చాటుమాటుగా కిరాణా షాపుల్లో మద్యం అమ్ముతున్న వాళ్లకి యూత్ కౌన్సిలింగ్
- మద్యం నియంత్రణ దిశగా మునుగోడులో మారుతున్న ముఖచిత్రం

**మునుగోడు:** నియోజకవర్గంలో మద్యం నియంత్రణపై మద్యం షాపుల సమయపాలన పై వెనక్కి తగ్గేదే లేదని తమ వద్దకు వచ్చిన మద్యం వ్యాపారులకు తేల్చి చెప్పిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సంకల్పానికి మునుగోడు నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్పందన వస్తుంది.

ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే వ్యాపారం ఎందుకని పొద్దంతా మీరు తాగిన తర్వాతే ప్రజలకు తాపించడని మద్యం వ్యాపారులను ఉద్దేశించి అన్న మాటలకు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, చదువుకున్న మేధావులు, సామాజిక అనుభవజ్ఞులు శభాష్ అంటున్నారు.. రాజగోపాల్ రెడ్డి మద్యం విషయంలో మాట్లాడే మాటలు అక్షర సత్యాలని మద్యం మహమ్మారి వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, గ్రామాలలో యుక్త వయసులోనే మహిళలు విధవలు గా మారుతున్నారని సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని చెబుతున్నారు...

2018లో తాను మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యుడి గా గెలిచిన తర్వాత గ్రామాలలో బెల్ట్ షాపులను నిర్మూలిస్తానని మునుగోడు నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు..గెలవగానే బెల్ట్ షాపులను నిర్మలించాలని పిలుపునిచ్చారు..ఆ పిలుపు అందుకున్న కొన్ని గ్రామ పంచాయతీలు గ్రామ సభ తీర్మానం చేసి బెల్ట్ షాపులను నిర్మూలించాయి.. బెల్టు షాపులను నిర్మూలించిన గ్రామాలకు తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరఫున ఐదు లక్షల ఆర్థిక సహాయం కూడా చేశారు.

కానీ రాష్ట్రంలో టిఆరచవతీతీచస్ పార్టీ అధికారంలో ఉండడం వల్ల గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్మూలన అనేది సక్సెస్ కాలేదు. తిరిగి 2023లో గెలిచిన తర్వాత మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్మూలన లేకుండా చేశారు.. అక్కడితో ఆగకుండా నూతన మద్యం పాలసీ రాగానే మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపులు దక్కించుకునే వాళ్లకు పలు సూచనలు చేశారు ఆ సూచనల ప్రకారం మధ్యాహ్నం ఒంటిగంటకు మాత్రమే వైన్ షాపులు తెరవాలని, సాయంత్రం 6 గంటల తరవాతే పర్మిట్ రూములను ప్రారంభించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మునుగోడులో మద్యం నియంత్రణ మద్యం షాపుల సమయపాలన కొనసాగుతోంది..

అయితే ఇటీవల కొందరు మద్యం షాపుల యజమానులు సమయపాలనలో కొద్దిగా మార్పులు తీసుకురావాలని కోరడానికి రావడంతో మద్యం షాపుల సమయపాలనలో ఎటువంటి మార్పు ఉండదని మద్యం వ్యాపారులకు తెగేసి చెప్పారు.. తాము ఎన్నుకున్న తమ నాయకుడు ప్రజల ఆరోగ్యం పట్ల కమిట్మెంట్తో పని చేస్తున్న విధానాన్ని చూసి ఆయన సంకల్పానికి అనుగుణంగా మునుగోడు నియోజకవర్గంలోని గ్రామాలలో చాటుమాటుగా బెల్ట్ షాపులను నిర్వహించొద్దని ర్యాలీలు నిర్వహిస్తున్నారు. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో







బెల్ట్ షాపులు నిర్వహించద్దని ర్యాలీ తీస్తూ ప్రతి ఒక్క కిరాణా షాప్ యజమాని దగ్గరికి వెళ్లి రాజగోపాల్ రెడ్డి సంకల్పానికి మద్దతుగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో చాటుమాటుగా మద్యం అమ్మకాలు జరిపితే ఊరుకోమని కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

ప్రకృతికి అనుగుణంగా మనిషి జీవన విధానం కొనసాగుతోంది సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు మనిషి కష్టపడి పని చేయాలని ప్రకృతి నేర్పింది.. ఎన్నో వేల తరాలు ఆ ప్రకృతి నియమాలకు కట్టుబడే జీవనాన్ని కొనసాగిస్తూ తరువాతి తరానికి ఆ జీవన విధానాన్ని అందించారు... కానీ ప్రకృతి విధానానికి విరుద్ధంగా సూర్యోదయం నుంచి తాగడం మొదలుపెడుతున్నారు.

పనిచేసుకొని పైసలు సంపాదిస్తూ భార్య పిల్లల్ని సాకాల్సిన సమయాన్ని తాగుడుకు కేటాయిస్తూ బానిసలుగా మారి కుటుంబాలను ఆర్థికంగా ఆరోగ్యంగా దెబ్బ తీసుకుంటున్నారు.. సూర్యోదయం నుండి తాగే విధానానికి స్వస్తి పలికి ప్రజలు పొద్దంతా పనిచేసుకున్న తర్వాతే తాగుడు గురించి ఆలోచించాలనే సంకల్పంతోనే మునుగోడు నియోజకవర్గంలో మద్యం నియంత్రణ మద్యం షాపుల సమయాలలో మార్పు విధానాన్ని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తీసుకొచ్చారు..తాను తాగుడుకు వ్యతిరేకం కాదని, పొద్దస్తమానం పనిచేయకుండా అతిగా తాగే విధానానికి మాత్రమే వ్యతిరేకమని ఎన్నో వేదికల మీద స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే వ్యాపారం మంచిదికాదని వైన్ షాపుల యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు..అక్కడితో ఆగకుండా మొదట మనం పాటిస్తేనే ప్రజలు పాటిస్తారని తనతో పాటు తిరిగే తన అనుచరులకు అభిమానులను కూడా పగటిపూట మద్యం సేవించొద్దని హుకుం జారీ చేయడంతో నాయకులు అభిమానులు కూడా పగటి పూట మద్యం తీసుకొనే విధానానికి స్వస్తి పలికారు...

# రైతు కమిషన్ బృందం రెండో రోజు నాసిక్ పర్యటన

**నాసిక్:** తెలంగాణ రైతు కమిషన్ బృందం నాసిక్ లో రెండో రోజు పర్యటన కొనసాగించింది. పలు వ్యవసాయ క్షేత్రాలను విజిట్ చేసి.. అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి పంటల సాగు విధానం, సాగుకయ్యే ఖర్చు, మార్కెటింగ్, లాభనష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఇక సహ్యాద్రి ఎండీ విలాస్ షిండే తో కమిషన్ బృందం సాయంత్రం భేటీ అయ్యింది. రెండు రోజులుగా నాసిక్ ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషన్ బృందానికి విలాస్ షిండే స్వాగతం పలికారు. సహ్యాద్రి క్యాంపస్ లో దాదాపు 2 గంటల పాటు పలు అంశాలపై చర్చించారు.

దక్షిణ భారత్ దేశంలో ప్రధానంగా తెలంగాణ లాంటి రాష్ట్రానికి సహ్యాద్రి ఫార్మ్స్ సహకారం కలవాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కోరారు. తెలంగాణలో గోదావరి, కృష్ణ నదులతోపాటు గొలుసుకట్టు చెరువులు ఉన్నాయని, అన్ని రకాల పంటల సాగుకు సారవంతమైన భూమి ఉందని, వాతావరణం సైతం అనుకూలంగా ఉంటుందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. రైతు బిడ్డా అని, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాలను విలాస్ షిండే కు కోదండరెడ్డి వివరించారు.

ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్.. విజన్ -2047లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చిన విషయం సైతం గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ వేస్తున్నారని తెలిపారు. ఆ దిశగానే సీఎం ప్రస్తుతం దావోస్ లో వున్నారని వివరించారు. సీఎం ఆదేశాల మేరకు కమిషన్ బృందం ఇతర రాష్ట్రాల్లో పర్యటిస్తుందని తెలిపారు. బలమైన ఫీూూ లు ఏర్పాటు కావాలని దానికోసం మీలాంటి వారు తెలంగాణకు రావాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి.. సహ్యాద్రి ఎండీ విలాస్ షిండే ను రిక్వెస్ట్ చేశారు.


కోదండరెడ్డి ఆహ్వానం మేరకు సహ్యాద్రి ఎండీ విలాస్ షిండే సానుకూలంగా స్పందించారు. కమిషన్ సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డిలు మాట్లాడుతూ.. దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణలోనే రైతు సంక్షేమ కమిషన్ ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయంపై మక్కువతో కమిషన్ ఏర్పాటు చేశారని, వ్యవసాయంపై అనుభవం వున్న చైర్మన్ కోదండరెడ్డి ఉండడం కూడా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు.

ములుగు, గద్వాల్ జిల్లాలో విత్తనోత్పత్తి చేసి నష్టపోయిన రైతులకు కమిషన్ చొరవ తీసుకొని కంపెనీల నుండి నష్టపరిహారం



ఇప్పించినట్లు వివరించారు. రాంరెడ్డి గోపాల్ రెడ్డి , భవానీ రెడ్డిలు సైతం పలు అంశాలపై షిండే డిస్కస్ చేశారు. ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెటింగ్ విధానం, పెట్టుబడి, మూసధోరణిలో సాగు, పంటల మార్పిడి పై చర్చించారు.

కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలో సాగిన పర్యటనలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోపాల్, కమిషన్ అధికారులు సంధ్యారాణి, హరి, స్రవంతి, రజిత, FPO లు ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.





# కాంగ్రెస్‌కే ఆ శక్తి ఉంది

### - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ధర్మపురి, (అక్షర గళం):** రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. తెలంగాణ వనరులు, సంపద సమానంగా పంచబడాలి, రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. గత పది సంవత్సరాల పాలనలో పాలన అంటే దోచుకోవడం, పంచుకోవడం మాత్రమేనని, ప్రస్తుతం సంపదను ప్రజల కోసం ఉపయోగించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ఖర్చు చేసింది. రైతు భరోసా, రైతు బీమా, యంత్ర పరికరాల పంపిణీ, డ్రిప్ ఇరిగేషన్, రైతు రుణమాఫీ, సన్నధాన్యానికి 500 బోనస్ వంటి పథకాలు అమలులోకి తీసుకువచ్చారని వివరించారు. సమాజం ఉమ్మడి కుటుంబంలా ఎదగాలని భావన చిన్ననాటి నుండి విద్యార్థుల్లో ఏర్పరచడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ప్రతి స్కూల్ 25 ఎకరాల విస్తీర్ణంలో, 200 కోట్లు పెట్టుబడితో రూపొందిస్తున్నట్లు, రాష్ట్రంలో ఒకేసారి 100 స్కూల్స్ కోసం 22,500 కోట్లు కేటాయించామని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదవారి ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామన్నారు. అధికారంలోకి రాగానే మొదటి దశలో నాలుగున్నర లక్షల ఇళ్లను మంజూరు చేసి, కొన్ని గృహ ప్రవేశాలు పూర్తయినట్లు తెలిపారు.

బిల్లులు ప్రతి వారం చెల్లిస్తూ, ప్రజలతో ప్రభుత్వం ఉన్న అనుబంధాన్ని సూచించారని అన్నారు. మహిళల సంక్షేమానికి ఉచిత చీరల పంపిణీ, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, 26 వేల కోట్లు వడ్డీ రహిత రుణాలు, ప్రతినెలా జీతాల సమయానికి చెల్లింపు వంటి కార్యక్రమాలన్నీ అమలులో ఉన్నాయి. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లిస్తున్నామన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 68,547 గృహ వినియోగదారులకు 200



యూనిట్ల గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 1.11 కోట్ల వినియోగదారుల్లో 52.087 లక్షలకు విద్యుత్ ఉచితంగా అందుతున్నదని వివరించారు. 263 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టి, స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు విద్యుత్ సమస్య పరిష్కారం కోసం నిధులు కేటాయిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

# రూ.1,000 కోట్ల పెట్టుబడికి రెడీ

### అమెరికా సంస్థ సర్గాడ్ ఎంవోయూ
### తెలంగాణ రైజింగ్ బృందంతో సర్గాడ్ సీఈఓ భేటీ

**దావోస్, హైదరాబాద్, (అక్షర గళం):** విమానయాన రంగంలో పేరొందిన అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థ రాష్ట్రంలో మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్ నెలకొల్పనుంది. రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో దశలవారీగా రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో సర్గడ్ సంస్థ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా దావోస్‌లో, సర్గాడ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీనివాస్ తోట ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మత్తులు, పునరుద్ధరణ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆసక్తిని సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు. సర్గాడ్ సంస్థకు ఏరోస్పేస్, రక్షణ, ఆటోమొబైల్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో విశేష అనుభవం ఉంది.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణను మూడు ప్రత్యేక జోన్లు గా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సేవల రంగానికి కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, తయారీ రంగానికి పెరి?అర్బన్ రీజియన్ ఎకానమీ , వ్యవసాయం, గ్రీన్ ఎకానమీ కి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామని , ఈ ప్రాంతాల్లో ఏదైనా ఒక చోట ఎంఆర్వో కేంద్రం




ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సంస్థ సీఈఓ కు సూచించారు. వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అత్యధిక ప్రోత్సాహకాలు అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఈ పెట్టుబడులతో తెలంగాణలోని ఎంఎస్ఎంఈ లకు పరికరాల తయారీ రంగంలో కొత్త అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# టీ20 ప్రపంచ కప్ 15 జట్ల స్క్వాడ్స్ విడుదల

**టీ20 ప్రపంచ కప్ కోసం 15 జట్లను ప్రకటించారు. అంతకుముందు, 15 మంది సభ్యులతో కూడిన టీం ఇండియా జట్టును ప్రకటించారు. దీని తర్వాత, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు మరియు ఆస్ట్రేలియన్ క్రికెట్ బోర్డు టీ20 ప్రపంచ కప్ కోసం తాత్కాలిక జట్లను ప్రకటించాయి. ఇప్పుడు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ మరియు ఆఫ్ఘనిస్తాన్ కూడా తమ టీ20 ప్రపంచ కప్ జట్లను ప్రకటించాయి. దీని ప్రకారం, రాబోయే టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనే 15 జట్లు ఈ క్రింది విధంగా ఉన్నాయి.**

**జింబాబ్వే:** సికందర్ రజా (కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, ర్యాన్ బర్లే, గ్రేమ్ క్రీమర్, బ్రాడ్లీ ఎవాన్స్, లకైవ్ మదాండే, టినోటెండా మపోసా, తడివానాషే మారుమణి, వెల్లింగ్‌టన్ మసకద్జా, టోనీ మునియోంగా, తషింగా ముసెకివా, లబెస్సింగ్ ముజారబానీ, రిచెర్న్ నైగ్రావానీ, లబెస్సింగ్ ముజారబానీ,

**ఇంగ్లాండ్ టీ20 జట్టు (తాత్కాలిక):** హ్యారీ బ్రూక్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జోస్ బట్లర్, సామ్ కుర్రాన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జామీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టోంగ్, ల్యూక్ వుడ్.

**స్ట్రేలియా టీ20 జట్టు (తాత్కాలిక):** మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నోలీ, పాట్ కమ్మిన్స్, టిమ్ డేవిడ్, కామెరాన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, లగెన్ మాక్స్‌వెల్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా.

**ఒమన్ టీ20 జట్టు:** జతీందర్ సింగ్ (కెప్టెన్), వినాయక్ శుక్లా, మహ్మద్ నదీమ్, షకీల్ అహ్మద్, హమ్మద్ మీర్జా, వసీం అలీ, కరణ్ సోనోవాల్, షా÷సైల్, నదీమ్ ఖాన్, సుఫ్యాన్ మెహమూద్, జై ఒడెదర, షఫీక్ జాన్, ఆశిష్ రమానంది, హసీన్ ఒడెదర, జితీన్.

**దక్షిణాఫ్రికా టీ20 జట్టు:** ఐడెన్ మార్క్రామ్ (కెప్టెన్), క్వింటన్ డి కాక్, టోనీ డి జోర్జి, డెవాల్డ్ బ్రేవిస్, డేవిడ్ మిల్లర్, డొనోవన్ ఫెరీరా, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, కగిసో రబడ, క్వేనా మఫాకా, లుంగి ఎన్‌గిడి,




జాసన్ స్మిత్, కార్బిన్, జార్జి లిన్నియా, జార్జి లిన్నియా.

**నెదర్లాండ్స్ టీ20 జట్టు:** స్కాట్ ఎడ్వర్డ్స్ (కెప్టెన్), కోలిన్ అకెర్మాన్, నోహ్ క్రూస్, బాస్ డి లీడే, ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాసెన్, కైల్ లకైన్, మైఖేల్ లెవిట్, జాక్ లియోన్-కాచెట్, మాక్స్ ఓ'డౌడ్, లోగాన్ వాన్ బీక్, టిమ్ వాన్ మ్వెలోఫ్, టిమ్ వాన్ మ్వెలోఫ్ మీకెరెన్, సాకిబ్ జుల్ఫికర్.

**ఆఫ్ఘనిస్థాన్ టీ20 జట్టు:** రషీద్ ఖాన్ (కెప్టెన్), నూర్ అహ్మద్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, సైదిఖుల్లా అటల్, ఫజల్‌హాక్ ఫరూకీ, రహ్మానుల్లా గుర్బాజ్, నవీన్ ఉల్ హక్, మహ్మద్ ఇషాక్, షాహిదుల్లా కమల్, మహ్మద్ నబీ, అజ్మతుల్లా నబీ, అజ్మతుల్లా నబీ, అజ్మతుల్లా నబీజే దర్విష్ రసూలీ, ఇబ్రహీం జద్రాన్.

**నమీబియా టీ20 జట్టు:** గెర్హార్డ్ ఎరాస్మస్ (కెప్టెన్), జేన్ గ్రీన్, బెర్నార్డ్ స్కోల్ట్జ్, రూబెన్ ట్రంపెల్మాన్, ఏఏ స్మిత్, జాన్ ఫ్రీలింక్, లారెన్ స్టీన్‌క్యాంప్, మలన్ క్రుగర్, నికోల్ లాఫ్టీ-ఈటన్, జాక్ బ్రాసెల్, బెన్ షికోంగో, ఏఅ బాల్ట్, డిలాన్ లీచర్, చిఖ హీంగెబర్గ్, మాక్స్ హింగో.

**న్యూజిలాండ్ టీ20 జట్టు:** మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, డారిల్ మిచెల్, ఆడమ్ మిల్నే, జేమ్స్ నీషమ్, లగెన్ ఫిలిప్స్, రాచిన్ రవీంద్ర, టిమ్ సీఫెర్ట్, ఇష్ సోధి.

**ఐర్లాండ్ టీ20 జట్టు:** పాల్ స్టిర్లింగ్ (కెప్టెన్), మార్క్ అడైర్, రాస్ అడైర్, బెన్ కాలిట్జ్, కర్టిస్ కాంపర్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్, మాథ్యూ హంఫ్రీస్, జోష్ లిటిల్, బారీ మెక్‌కార్తీ, హ్యారీ టెక్టర్, టిమ్ టెక్టర్, లోర్కాన్ టక్కర్, బెన్ వైట్, క్రెయిగ్ యంగ్

**బంగ్లాదేశ్:** లిటన్ దాస్ (కెప్టెన్), తాంజిద్ హసన్, పర్వేజ్ హాళస్సేన్ ఎమాన్, సైఫ్ హసన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హాళస్సేన్, క్వాజీ నూరుల్ హసన్ సోహన్, షక్ మహేదీ హసన్, రిషాద్ హాళస్సేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రహమాన్, తన్‌జీమ్ ఎ హసన్, తన్‌జీమ్ ఎ హసన్.

**ఇటలీ టీ20 జట్టు:** వేన్ మాడ్సెన్ (కెప్టెన్), మార్కస్ కాంపోపియానో, జియాన్ పియరో మీడే, జైన్ అలీ, అలీ హసన్, క్రిషన్ జార్జ్, హ్యారీ మానెంటి, ఆంథోనీ మోస్కా, జస్టిన్ మోస్కా, సయ్యద్ నఖ్వీ, బెంజమిన్ మనేంటి, జస్‌ప్రీత్ సింగ్, గ్రాంట్ స్మత్స్, గ్రాంట్ స్మత్స్.

**నేపాల్ టీ20 జట్టు:** రోహిత్ పౌడెల్ (కెప్టెన్), దీపేంద్ర సింగ్ ఎయిరి, సందీప్ లామిచానే, కుశాల్ భుటర్గల్, ఆసిఫ్ షేక్, సందీప్ జోరా, ఆరిఫ్ షేక్, బసీర్ అహ్మద్, సోంపాల్ కమీ, కరణ్ కెసి, నందన్ యాదవ్, గుల్షన్ ఝా, బి షేర్ రాజభమ్సి, లోకేశ్ రాజభంసీ, లోకేశ్

**కెనడా టీ20 జట్టు:** దిల్‌ప్రీత్ బజ్వా (కెప్టెన్), అజయ్‌వీర్ హుండాల్, అన్ష్ పటేల్, ధిల్లాన్ హెలిగర్, హర్ష్ ఠాక్రే, జస్కరన్‌దీప్ భట్టర్, కలీమ్ సనా, కన్వర్‌పాల్ తత్గూర్, నవనీత్ ధలీవాల్, నికోలస్ కిర్టన్, రవీందర్‌పాల్ సింగ్, సాద్ బిన్ యూ జాఫ్రే, శివంబ్రా శర్మ, మోబ్రా షర్యస్ యువరాజ్ సమ్రా.

**భారత టీ20 జట్టు:** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, వాషింగ్టన్ కీపర్ (వాషింగ్‌టన్ కీపర్), క్వింగ్టన్ కీపర్ రింకూ సింగ్.

## చరిత్ర సృష్టించిన
# అభిషేక్ శర్మ!

టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో 25 బంతుల్లోపే అత్యధిక హాఫ్ సెంచరీలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా ఈ పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 5వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డ్ సాధించాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా నాగ్‌పూర్ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా అభిషేక్ శర్మ ఈ ఫీట్ సాధించాడు. అంతర్జాతీయ 7 హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. న్యూజిలాండ్‌పై అత్యంత వేగంగా భారత బ్యాటర్ నమోదు చేసిన టీ20 హాఫ్ సెంచరీ కూడా ఇదే. ఈ క్రమంలో అతను కేఎల్ రాహుల్, రోహిత్ శర్మల రికార్డ్‌ను అభిషేక్ శర్మ అధిగమించాడు. ఈ ఇద్దరూ 23 బంతుల్లో న్యూజిలాండ్‌పై హాఫ్ సెంచరీ సాధించగా.. అభిషేక్ శర్మ 22 బంతుల్లో హాఫ్ సెంచరీ బాది ఈ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు. ఈ మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన అభిషేక్ శర్మ తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని



టీ20ల్లో 25 బంతుల్లోపే హాఫ్ సెంచరీ సాధించడం అభిషేక్ శర్మకు ఇది 8వ సారి. ఈ క్రమంలో అతను ఇంగ్లండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వెస్టిండీస్ ప్లేయర్ ఎవిన్ లూయిస్‌లను అధిగమించాడు. ఈ ముగ్గురు బ్యాటర్లు 25 బంతుల్లోపు చేజార్చుకున్నాడు. 35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌తో 84 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అతని విధ్వంసంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 238 పరుగుల భారీ స్కోర్ చేసింది.






## బంగ్లాదేశ్ విజ్ఞప్తిని
# తిరస్కరించిన ఐసీసీ

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు ఎదురుదెబ్బ తగిలింది. వచ్చే నెలలో భారత్‌లో జరగాల్సిన టీ20 వరల్డ్‌కప్‌లో తమ మ్యాచ్‌ల వేదిక మార్చాలంటూ బీసీబీ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తిరస్కరించింది. భారత్‌లో బంగ్లాదేశ్ క్రికెటర్లు, అభిమానులు, మీడియా, సిబ్బందికి భద్రతాపరమైన ముప్పు ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని ఐసీసీ పేర్కొంది. దీంతో షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుందని ఐసీసీ స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమావేశంలో ఐసీసీ నిర్ణయం తీసుకుంది.

వేదిక మార్పుపై బీసీబీ చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ఐసీసీ, భారత్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లకు భద్రతాపరమైన అంశాలను స్వయంగా సమీక్షించింది. ఈ క్రమంలో భారత్‌లో మ్యాచ్‌లు జరగనున్న ఏ వేదికల్లోనూ బంగ్లాదేశ్ ఆటగాళ్లు, అధికారులు, మీడియా సిబ్బంది, అభిమానుల భద్రతకు ఎలాంటి ముప్పు లేదని ఐసీసీ నిర్ధారించింది. ఎలాంటి భద్రతాపరమైన ముప్పు లేనప్పుడు టోర్నీలో వేదికలు మారుస్తే భవిష్యత్‌లో ఇతర జట్లనుంచి తరచూ ఇలాంటి ప్రతిపాదనలు వచ్చే అవకాశాలు ఉంటాయని ఐసీసీ పేర్కొంది. 'ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్ వేదికలను వేరే చోటుకి మార్చడం వల్ల ఐసీసీ పవిత్రతకు భంగం కలుగుతుందని, ప్రపంచ పాలక సంస్థ తటస్థతను దెబ్బతీస్తుందని బోర్డు గుర్తించింది' అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ఈ వ్యవహారంపై బీసీబీ అధికారులతో ఇప్పటికే పలుమార్లు జరిపిన చర్చల్లో టోర్నమెంట్ భద్రతా ఏర్పాట్లపై ఐసీసీ వివరణాత్మక సమాచారాన్ని అందించినట్లు తెలిసింది.

కాగా, భద్రతాపరమైన కారణాలు సాకుగా చూపుతూ వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు భారత్‌కు రాదంటూ ఇటీవల బీసీబీ ప్రకటించింది. తమ మ్యాచ్‌ల వేదికను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాసింది. అయితే టోర్నీ ప్రారంభానికి చాలా తక్కువ సమయమున్న నేపథ్యంలో వేదికల తరలింపు సాధ్యం కాదని బీసీబీకి ఐసీసీ తేల్చి చెప్పింది. ఈ విషయంపై బుధవారం (జనవరి 21) లోగా ఏదో ఒకటి తేల్చుకోవాలని డెడ్‌లైన్ విధించింది. ఈ క్రమంలోనే ఐసీసీ తాజా సమావేశంలో నిర్ణయం తీసుకుంది. మరి దీనిపై బంగ్లాదేశ్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ఐసీసీ చెప్పినట్లు భారత్‌కు వస్తుందా లేదా టోర్నీ నుంచి తప్పుకుంటుంగా అనేది ఆసక్తిగా మారింది. అయితే ఈ వరల్డ్‌కప్ టోర్నీకి భారత్‌తోపాటు శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఫిబ్రవరి 07న టోర్నీ ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ గ్రూప్ దశలో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో మూడు కోల్‌కతా ఈడెన్ గాడన్స్, మరో ఒక మ్యాచ్‌కు ముంబయి వాంఖడే స్టేడియాలు వేదికలు కానున్నాయి.

## టాప్‌లోకి దూసుకెళ్లిన
# డారిల్ మిచెల్

న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ వన్డే ర్యాకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో మిచెల్ ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్ ర్యాంక్ దక్కించుకున్నాడు. ప్రస్తుతం మిచెల్ 845 రేటింగ్స్‌తో టాప్‌లో ఉన్నాడు. నిన్నటిదాకా టాప్‌లో ఉన్న టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఒక స్థానం కోల్పోయి (795 రేటింగ్స్) రెండో ప్లేస్‌కు పడిపోయాడు. మరో స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కూడా ఒక స్థానం దిగజారి (757 రేటింగ్స్) నాలుగో ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. ఇక టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (723 రేటింగ్స్) ఐదో స్థానంలో ఉన్నాయి. అటు సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్ 10లోకి దూసుకొచ్చాడు. అతడు 670 రేటింగ్ పాయింట్లతో పదో ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. దీంతో టాప్ 10లో నలుగురు టీమ్‌ఇండియా బ్యాటర్లు ఉన్నారు. టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గతవారమే నెం 1 దక్కించుకున్నాడు. గతేడాది సౌతాఫ్రికా, తాజాగా న్యూజిలాండ్‌తో సిరీస్‌లో రాణించడంతో విరాట్, దాదాపు నాలుగేళ్ల తర్వాత వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం దక్కించుకున్నాడు. అయితే ఒక్క వారంలోనే కోహ్లీ టాప్ ప్లేస్ కోల్పోయాడు. ఇటీవల భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1 తేడాతో నెగ్గింది. ఈ సిరీస్‌లో కివీస్ విజయంలో డారిల్ మిచెల్ కీలక పాత్ర పోషించాడు. నిర్ణయాత్మకమైన మూడో వన్డేలో మిచెల్ 137 పరుగులతో రాణించాడు. ఇక ఓవరాల్‌గా సిరీస్‌లో 352 పరుగులు బాది సత్తా చాటాడు. దీంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగులు బాదిన న్యూజిలాండ్ బ్యాటర్‌గా రికార్డు కొట్టాడు. ఓవరాల్‌గా ఈ లిస్ట్‌లో పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ ఆజమ్ (360 పరుగులు లబ వెస్టిండీస్, 2016), శుభ్‌మన్ గిల్ (360 పరుగులు లబ న్యూజిలాండ్) మిచెల్ కంటే ముందున్నారు.

కాగా, వన్డే ర్యాకింగ్స్‌లో అగ్రస్థానం దక్కించుకోవడం మిచెల్‌కు ఇది




రెండోసారి. గతేడాది అక్టోబర్‌లో తొలిసారి మిచెల్ నెం 1 ర్యాంక్‌కు చేరుకున్నాడు. అయితే తొలిసారి అతడు కేవలం మూడు రోజులే టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అక్టోబర్‌లో అస్ట్రేలియాపై అద్భుతమైన ప్రదర్శనతో నవంబర్‌లో డారిల్ మిచెల్‌ను వెనక్కినెట్టి రోహిత్ శర్మ అగ్రస్థానం దక్కించుకున్నాడు. డారిల్ మిచెల్ ఈ సిరీస్‌తో పలు అరుదైన ఘనతలు సాధించాడు. వన్డేల్లో భారత్‌పై అత్యధిక సెంచరీలు సాధించిన రెండో విదేశీ బ్యాటర్‌గా మిచెల్ (4) ఘనత సాధించాడు. ఈ విషయంలో సౌతాఫ్రికా మాజీ బ్యాటర్ ఏబీ డివిలియర్స్ (5) టాప్ లో ఉన్నాడు. అలాగే డారిల్ మిచెల్ వన్డేల్లో ఇప్పటిదాకా 54 ఇన్నింగ్స్ ఆడాడు. ఇందులో ఒక్కసారి కూడా అతడు డకౌట్ కాలేదు. అలా ఒక్కసారి కూడా డకౌట్ కాకుండా అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రెండో బ్యాటర్‌గానూ రికార్డు కొట్టాడు.

# హార్దిక్ పాండ్యాపై ఆకాశ్ చోప్రా ప్రశంసలు

మిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపై మాజీ క్రికెటర్, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ప్రశంసల జల్లు కురిపించాడు. హార్దిక్ పాండ్యాలా బంతితో పాటు బ్యాట్‌తో రాణించే ఆటగాడు ఈ ప్రపంచంలోనే లేడని కొనియాడాడు. అతను లేకుంటే టీమిండియా కాంబినేషన్ అసంపూర్ణమని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ పాండ్యాతోనే టీమిండియాకు సరైన కాంబినేషన్ లభిస్తుందని తెలిపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు టీమిండియా తమ చివరి ద్వైపాక్షిక టీ20 సిరీస్‌కు సిద్ధమైంది. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో బరిలోకి దిగనుంది. టీమ్ కాంబినేషన్‌ను ÷నైల్ చేసేందుకు మేనేజ్‌మెంట్ ఈ సిరీస్‌ను వాడుకోనుంది. ఈ సిరీస్ నేపథ్యంలోనే తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన ఆకాశ్ చోప్రా.. టీమిండియాకు హార్దిక్ పాండ్యా ఎంత కీలకమో వివరించాడు. 'హార్దిక్ పాండ్యా లేకుంటే టీమిండియా కాంబినేషన్ అసంపూర్ణంగా ఉంటుంది. ఈ ప్రపంచంలోనే హార్దిక్ లాంటి ఆటగాడు మరొకరు లేరు. బ్యాట్‌తో పాటు బంతితో ఈ దేశంలోనే మరెవరూ రాణించలేరు. హార్దిక్ పాండ్యా కొత్త బంతితో బౌలింగ్ చేయగలడు. అలాగే డెత్ ఓవర్లలో కూడా జట్టుకు ఉపయోగపడగలడు. వరుణ్ చక్రవర్తి లేదా కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులో ఆడించాలనుకుంటే.. అప్పుడు 8వ స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడు కూడా కావాలి. ఇలా అన్ని కావాలంటే కుదరదు. ఎందుకంటే 12 మంది ఆటగాళ్లను ఆడించలేం. కేవలం హార్దిక్ పాండ్యా మాత్రమే ఈ లోటును భర్తీ చేయగలడు. అతను కొత్త బంతితో పాటు డెత్ ఓవర్లలోనూ తన బౌలింగ్‌తో ప్రభావం చూపగలడు. భారత్ గెలిచిన టీ20 ప్రపంచకప్ 2024 ÷నైల్లోనూ ఆఖరి ఓవర్‌ను హార్దిక్ పాండ్యానే వేశాడు. హార్దిక్ ఒక్కడే ఇలా చేయగలడు. అతనిలాంటి ఆటగాడు మరెక్కడా దొరకడు. న్యూజిలాండ్‌తో సిరీస్ భారత్‌కు చాలా కీలకం. న్యూజిలాండ్ కూడా పూర్తి సన్నద్ధతతో వచ్చింది. వన్డే సిరీస్‌కు కొందరు ఆటగాళ్లు దూరంగా ఉన్నా.. టీ20 సిరీస్‌లో మాత్రం పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతుంది. వారి ప్రధాన టీ20 ప్రపంచకప్ జట్టు ఆడుతోంది. టీమిండియా ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లతో ఆడుతారా వారికి ఏ బ్యాటర్లు అవసరం తిలక్ వర్మ ఫిట్‌గా ఉంటే.. రింకూ సింగ్‌కు అవకాశం ఇస్తారా శ్రేయస్ అయ్యర్‌నే కొనసాగిస్తారా అనే ప్రశ్నలకు ఈ సిరీస్‌లో సమాధానాలు రాబట్టాల్సి ఉంది.'అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు.



అక్షరగళం



# డెకాయిట్‌లో ముగిసిన మృణాల్ యాత్ర





టాలీవుడ్‌లో కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో మరో కీలక దశలో ఉన్నాడు. వరుసగా విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్న శేష్, ఇప్పుడు భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న తన తాజా చిత్రం 'డెకాయిట్' తో మరోసారి బజ్ క్రియేట్ చేస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ తనకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తిగా ముగించుకుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటిస్తూ, సెట్స్‌లో తీసిన కొన్ని ప్రత్యేక ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. టీమ్ మొత్తం కలిసి ఉన్న ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్ ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఇద్దరూ నటనలో మంచి అనుభవం ఉన్నవాళ్లే కావడంతో, ఈ సినిమాలో భావోద్వేగ సన్నివేశాలు బలంగా ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ హై వోల్టేజ్ డ్రామాకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు సమాచారం. మృణాల్ షూటింగ్ ముగియడంతో, ఇకపై సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరింత వేగంగా సాగనున్నాయి. 'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన మృణాల్ ఠాకూర్, ఈ చిత్రంలో ఎలాంటి పాత్రలో కనిపించబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఆమె పాత్ర కథలో కీలక మలుపులు తిప్పేలా ఉంటుందని చిత్ర వర్గాలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉంటే, 'డెకాయిట్' రిలీజ్ డేట్‌పై కూడా మేకర్స్ స్పష్టత ఇచ్చారు. ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించారు. ఉగాది పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం, తెలుగు మరియు హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. పండుగ సీజన్ కావడంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. అడివి శేష్ ఎప్పటిలాగే ఈసారి కూడా కొత్త తరహా కథను ఎంచుకున్నాడు. 'డెకాయిట్' ఒక రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. శేష్ లుక్, ప్రెజెంటేషన్ అన్నీ కొత్తగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ చిత్రానికి షానీల్ డియో దర్శకత్వం వహిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. అనురాగ్ కశ్యప్, కమలక్ష్మి భాస్కర్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటించడం సినిమాకు అదనపు బలాన్ని ఇస్తోంది.


# సోషల్ మీడియా విమర్శలకు దూరం

### దురంధర్ మూవీపై సారా అర్జున్

ఇటీవల సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్' విజయం ఎంతటి హాట్ టాపిక్‌గా మారిందో.. ఇందులో ప్రధాన పాత్రలో నటించిన నటీనటుల మధ్య వయసు వ్యత్యాసం కూడా అంతే వైరల్ అయ్యింది. రణ్‌వీర్ సింగ్ , సారా అర్జున్ మధ్య 20 ఏళ్ల వయసు తేడా ఉండడంతో ఈ సినిమా టీజర్ వచ్చినప్పటినుంచే విమర్శలు మొదలయ్యాయి. తాజాగా దీనిపై సారా అర్జున్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను ఇలాంటి విషయాలు పట్టించుకోను అని అన్నారు. ఇవన్నీ సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలే కదా.. నేను సామాజిక మాధ్యమాల్లో పెద్దగా యాక్టివ్‌గా ఉండను. అందుకే అవి నా వరకు రాలేదు. అయినా.. ఒక విషయంపై ఎవరి అభిప్రాయాలు వారికిఉంటాయి. 'మనం ప్రశాంతంగా ఉందాం.. పక్కవారిని ప్రశాంతంగా ఉండనిద్దాం' అనే సిద్ధాంతాన్ని నేను నమ్ముతాను. పాటిస్తాను. నాకు 'ధురంధర్' కథ నచ్చింది. ఆ కథకు నేను న్యాయం చేస్తానని అనిపించింది. అందుకే ఓకే చేశా. బహుశా దీనిగురించి టీజర్ వచ్చినప్పుడే మాట్లాడుకున్నారు. నేను ఆ సమయంలో అసలు ఫోన్ చూడలేదు' అని చెప్పారు. 'నేను చదువుకున్న బోర్డింగ్ స్కూల్‌లో మాకు ఫోన్ లేదు. బయటకు వచ్చిన దగ్గర నుంచి వరుస సినిమాలతో బిజీగా ఉన్నా. అందుకే సోషల్ మీడియా అలవాటు కాలేదు. ఏదైనా పోస్ట్ చేయాలనుకున్నప్పుడు చేస్తానంతే. వినోదం కోసం ఇతర మార్గాలు ఎంచుకుంటా. విరామ సమయంలో ట్రిప్‌లకు వెళ్తుంటా. నేను ఒకేచోట ఎక్కువ రోజులు ఉండలేను' అని సారా అర్జున్ చెప్పారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధురంధర్' గతేడాది డిసెంబర్ 5న విడుదలై సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికీ థియేటర్‌లలో సందడి చేస్తోంది. ఇప్పటి వరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,283 కోట్లు వసూలు చేసింది.

# పవన్ ఉస్తాద్ కోసం చంద్రబోస్ పట్టు

### మేనరిజానికి తగ్గట్లుగా బ్యాక్ గ్రౌండ్ సాంగ్



పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్ర పోషిస్తోంఇ. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ సింగిల్ దేఖ్ లేంగే సాలా నెట్టింటిని షేక్ చేస్తుందని తెలిసిందే. తాజాగా మరో క్రేజీ అప్‌డేట్ అందించారు మేకర్స్. ప్రముఖ లిరిసిస్ట్ చంద్రబోస్ రాసిన బ్యాక్ గ్రౌండ్ సాంగ్ రెడీ అయింది. ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్ సెన్సేషనల్ లిరిక్స్‌తో పవన్ స్టార్ మేనరిజాన్ని మరోసారి చూపించబోతుంది. వేచి ఉండండి.. అంటూ చంద్రబోస్ రిలిక్స్ సిద్ధం చేస్తున్న స్టిల్‌ను షేర్ చేశారు. ఇప్పుడీ స్టిల్ నెట్టింట వైరల్ అవుతూ మరో బ్లాక్ బస్టర్ సాంగ్ రెడీ అవుతుందని చెప్పకనే చెబుతోంది. దేవీ శ్రీ ప్రసాద్ కంపోజిషన్‌లో విశాల్ దడ్‌లానీ పాడిన రంపంపం రంపంపం స్టెప్పేస్తే భూకంపం.. దేఖ్‌లేంగే సాలా సాంగ్ అంటూ లాంగ్ గ్యాప్ తర్వాత పవన్ కల్యాణ్‌లోని స్టైలిష్ డ్యాన్స్‌ను మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై చూపించబోతున్నట్టు విజువల్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఇక భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో పవన్ కల్యాణ్ తనదైన స్టైల్‌లో డైలాగ్స్ చెబుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాడు. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ఎలాన్ చేస్తుండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# నవీన్ చంద్ర హనీ మూవీ



నవీన్ చంద్ర కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హనీ'. ఈ సినిమాకు కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. క్షుం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. టీజర్ చూస్తుంటే.. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల ఆధారంగా, సమాజంలోని మూఢ నమ్మకాలు మరియు అంధ విశ్వాసాల నేపథ్యంలో రూపొందింది. సాధారణ హారర్ సినిమాలకు భిన్నంగా, కేవలం భయపెట్టడమే కాకుండా ఒక మార్మిక ప్రపంచాన్ని ఈ టీజర్‌లో ఆవిష్కరించారు. చీకటి, నిశ్శబ్దం, మర్మమైన శక్తుల కలయికతో దర్శకుడు కరుణ కుమార్ వెన్నులో వణుకు పుట్టించే విజువల్స్‌ను వెండితెరపైకి తీసుకొస్తున్నారు. ప్రధాన పాత్రలో నవీన్ చంద్ర నటన, దివ్య పిలళ్లై, దివి, రాజా రవీంద్రల గూఢమైన పాత్రలు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. అజయ్ అరసాడ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రధాన బలమని చెప్పవచ్చు. నాగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ ఈ చిత్రానికి సాంకేతిక హంగులను జోడించాయి. సైకలాజికల్ డెప్త్ మరియు సోషల్ రిలవెన్స్ ఉన్న ఈ 'హనీ' చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది.








# అనుకున్న టైమ్‌కే వారణాసి విడుదల

సూపర్‌స్టార్ మహేశ్ బాబు ,దర్శకధీరుడు రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'పై ఇప్పటికే దేశవ్యాప్తంగా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, విడుదల సంవత్సరాన్ని కూడా మేకర్స్ వెల్లడించారు. అయితే రాజమౌళి సినిమాలు అనుకున్న షెడ్యూల్‌కు కచ్చితంగా పూర్తవుతాయా అనే సందేహం ప్రేక్షకుల్లో కొత్తది కాదు. గత చిత్రాల అనుభవం నేపథ్యంలో, 'వారణాసి' నిజంగా 2027లో విడుదల అవుతుందా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో గట్టిగానే వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం మరోసారి స్పందించి, సినిమా 2027లోనే ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టత ఇచ్చింది. ఈ ప్రకటనతో కొంతమంది అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు మాత్రం ఇంకా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉగాది లేదా శ్రీరామనవమి లాంటి పండుగ సీజన్‌లో సినిమా విడుదలయ్యే అవకాశముందని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. అయితే, ఇంకా ఏడాది మాత్రమే మిగిలి ఉండటంతో అంత భారీ ప్రాజెక్ట్‌ను ఆలోపు పూర్తి చేయగలరా అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. ఈ చిత్రంలో మహేశ్ బాబు సరసన గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇది మహేశ్ కెరీర్‌లోనే కాకుండా, ప్రియాంకకు కూడా ఒక ప్రత్యేకమైన ఇండియన్ ప్రాజెక్ట్‌గా మారనుంది. విలన్ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనుండటం మరో హైలైట్. అంతేకాదు, సినిమాలో ఒక కీలక ఘట్టంలో మహేశ్ బాబు రాముడి పాత్రలో కనిపిస్తారని రాజమౌళి ఇప్పటికే వెల్లడించడంతో ఈ అంశంపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'వారణాసి'ని టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో, భారతీయ పురాణాలు, ఆధునిక సైన్స్‌ను మేళవిస్తూ రూపొందిస్తున్నారని సమాచారం. భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ టీమ్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అభిమానులు 'రిలీజ్ ఆలస్యమైనా పర్వాలేదు, కానీ ఇది లైఫ్‌టైమ్ ఎక్స్‌పీరియన్స్ మూవీ కావాలి' అంటూ సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, మేకర్స్ 2027 డేట్‌కు కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేసినప్పటికీ, ఈ సినిమా చుట్టూ ఉన్న క్యూరియాసిటీ మాత్రం రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది. 'వారణాసి' ఎప్పుడు వచ్చినా, అది భారతీయ సినిమాకు మరో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా ఉంది.



# పవన్ సార్..ప్రధాని స్థాయికి ఎదిగినా ఆశ్చర్యం లేదు

### - నటి నిధి అగర్వాల్

తన సినిమాల విడుదల సమయాల్లోనే కాకుండా తరచూ ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటూ ఉంటారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఆమె ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. పవన్ కల్యాణ్ ఎంతోమందికి దేవుడితో సమానం. ఆయనంటే అంత క్రేజ్ ఉంది. అలాంటి అభిమానం కొందరికి మాత్రమే సొంతం. ఆయన కూడా అభిమానులను అలానే చూసుకుంటారు. ఆయనతో కలిసి వర్క్ చేసేటప్పుడు నేను ప్రత్యక్షంగా చూశాను. కలిసిన అందరితో బాగా మాట్లాడతారు. 'హరిహర వీరమల్లు'కు వర్క్ చేసే సమయంలో చాలా మంది నా దగ్గరకు వచ్చి 'మీరు మా దేవుడితో వర్క్ చేస్తున్నారు' అని అనేవారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటారు. వందశాతం కష్టపడతారు. ఎలాంటి విషయాన్నైనా ధైర్యంగా చెబుతారు. నిజాయతీగా ఉంటారు.

సినిమాలతో సంబంధం లేకుండా ప్రజలు ఆయన్ని ఇష్టపడతారు. భవిష్యత్తులో ఆయన ప్రధాని అయినా ఆశ్చర్యపడను' అని నిధి అన్నారు. ఒకరిని ఉన్నతస్థానాలకు తీసుకెళ్లడానికి కాకుండా.. తొక్కేయడానికి భారీగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. నటీనటులకు కూడా ఎమోషన్స్ ఉంటాయి. నెగెటివ్ ప్రచారం వల్ల మానసికంగా కుంగిపోతారు. వాళ్లతో పాటు వాళ్ల కుటుంబాలు కూడా ఎంతో బాధను అనుభవిస్తాయని నిధి ఆవేదన వ్యక్తం చేశారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154